


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 356 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : ఒంగోలు | బుధవారం 26 ఆగస్టు 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :356 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : ONGOLE | WED 26 AUGUST 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



## స్థానిక ఎన్నికల్లో కూటమి ఐక్యతను కాపాడండి..
## వైసీపీ డ్రామాలను నమ్మొద్దు: లోకేశ్

- రాయదుర్గం నియోజకవర్గం కనేకల్ మండలం నల్లంపల్లిలో కార్యకర్తల సమావేశం
- హాజరైన టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్
- కూటమిలో విభేదాలు సృష్టించే ప్రయత్నాలపై అప్రమత్తంగా ఉండాలని పిలుపు
- కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకూ గుర్తింపు ఇస్తామని హామీ
- పులివెందుల ప్రజల కోసమైనా జగన్ అసెంబ్లీకి రావాలని సవాల్
- కణేకల్‌కు డిగ్రీ కళాశాల మంజూరు బాధ్యత తనదేనని ప్రకటన

పెన్ పవర్ డెస్క్:రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కూటమి శ్రేణులు సమష్టిగా పనిచేయాలని టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే అసలైన బలమని, కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ సముచిత గుర్తింపు, గౌరవం కల్పిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గంలోని

- మిగతా 2లో




## రాయలసీమకు సుజ్లాన్ భరోసా..
### రూ.10 వేల కోట్ల ప్రాజెక్టుకు మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన

- రాయదుర్గంలో సుజ్లాన్ విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు శంకుస్థాపన
- రూ.10,000 కోట్ల పెట్టుబడితో 1,325 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం
- ప్రాజెక్టు ద్వారా 4,000 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు
- మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా కొత్త బ్లేడ్ ప్రొడక్షన్ లైన్స్ ప్రారంభం
- అనంత, ఉరవకొండ, కల్యాణదుర్గం నియోజకవర్గాల్లో ప్రాజెక్టుల ఏర్పాటు

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో పునరుత్పాదక ఇంధన రంగం కొత్త ఊపు అందుకుంది. పవన విద్యుత్ రంగంలో రాష్ట్రానికి మరో భారీ పెట్టుబడి తరలివచ్చింది. అనంతపురం జిల్లా, రాయదుర్గం నియోజకవర్గంలో ప్రఖ్యాత సుజ్లాన్ సంస్థ రూ. 10,000 కోట్ల భారీ పెట్టుబడితో నెలకొల్పనున్న విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 4,000 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. రాయదుర్గం నియోజకవర్గంలోని కనేకల్లు మండలం, హులికెర గ్రామం వద్ద ఈ భారీ ప్రాజెక్టుకు అంకురార్పణ జరిగింది. మొత్తం 1,325 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేయనున్న ఈ పవన విద్యుత్ ప్రాజెక్టులను రాయదుర్గం, ఉరవకొండ, కల్యాణదుర్గం నియోజకవర్గాల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో అభివృద్ధి చేయనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా, సుజ్లాన్ సంస్థ నూతనంగా ఏర్పాటు చేసిన 'ఎ144 న్యూ బ్లేడ్ ప్రొడక్షన్ లైన్స్'ను కూడా మంత్రి లోకేశ్ అధికారికంగా ప్రారంభించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించి, ప్రాజెక్టుకు సంబంధించిన ఆడియో విజువల్ (ఏవీ) ప్రదర్శనను వీక్షించారు. అంతకుముందు బళ్లారి సమీపంలోని

- మిగతా 2లో



## బీసీలపై కక్ష సాధింపు వైసీపీదే.. మాది కాదు

- అవినీతి కేసులను బీసీలపై కక్షగా వైసీపీ చిత్రీకరిస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు విమర్శ
- గత ప్రభుత్వంలో తనతో పాటు బీసీ నేతలపై పెట్టిన అక్రమ కేసులను గుర్తు చేసిన అచ్చెన్న
- బీసీ రిజర్వేషన్లను 34% నుంచి 24%కి తగ్గించింది వైసీపీయేనని ఆరోపణ
- చంద్రబాబు నాయకత్వంలోనే బీసీలకు ఆర్థిక, రాజకీయ సాధికారత అని వ్యాఖ్య
- రిజర్వేషన్ల పునరుద్ధరణపై న్యాయపరంగాను పోరాడతామని స్పష్టీకరణ

- మిగతా 2లో



## గోదావరి పుష్కరాలపై సీఎం చంద్రబాబు సమీక్ష..
## ఏర్పాట్లు అద్భుతంగా ఉండాలి!

- గోదావరి పుష్కరాల పనుల పురోగతిపై సీఎం చంద్రబాబు సమీక్ష
- వచ్చే ఏడాది జూన్ 26 నుంచి 12 రోజుల పాటు పుష్కరాల నిర్వహణ
- రూ.4,026 కోట్ల అంచనాతో 4,932 పనుల పురోగతిపై చర్చ
- భక్తులకు ప్రపంచస్థాయి వసతులు కల్పించాలని అధికారులకు ఆదేశం
- పుష్కరాల నిర్వహణలో స్థానిక ప్రజల భాగస్వామ్యం పెంచాలని సూచన

పెన్ పవర్ డెస్క్:వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాలను చరిత్రలో నిలిచిపోయేలా అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. దేశ, విదేశాల నుంచి తరలివచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఏర్పాట్లు చేయాలని ఆయన స్పష్టం చేశారు. పుష్కరాల పనుల పురోగతిపై సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, 2025 జూన్ 26 నుంచి జూలై 7 వరకు 12 రోజుల పాటు జరిగే ఈ మహా వేడుకలను విజయవంతం చేసేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. రవాణా, పారిశుద్ధ్యం, నిరంతరాయ తాగునీటి సరఫరా, వైద్య సేవలు, భద్రత, వసతి కల్పనలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. పుష్కరాల నిర్వహణ అనేది కేవలం ప్రభుత్వ కార్యక్రమంలా కాకుండా, స్థానిక ప్రజలను భాగస్వాములను చేయడం ద్వారా ఒక ప్రజా ఉద్యమంలా

- మిగతా 2లో



## రేవంత్ రెడ్డితో దేశ భద్రతకు ముప్పు..
## ఎంపీ అర్వింద్ సంచలన వ్యాఖ్యలు

- దేశ వ్యతిరేక శక్తులతో రేవంత్ రెడ్డి చేతులు కలుపుతున్నారన్న అర్వింద్
- దేశంపై విషం చిమ్మే వారితో మాట్లాడి రాజకీయ లబ్ధి పొందేందుకు యత్నిస్తున్నారని వ్యాఖ్య
- కేసీఆర్ కంటే రేవంత్ రెడ్డి ప్రమాదకరమైన వ్యక్తి అని వ్యాఖ్య
- ఇకపై రేవంత్ ప్రతి కదలిక జాతీయ భద్రతా సంస్థల పరిశీలనలో ఉంటుందని వెల్లడి

- మిగతా 2లో

## ఏపీ లోకాయుక్తగా జస్టిస్ మల్లిఖార్జునరావు ప్రమాణ స్వీకారం..

### హాజరైన సీఎం చంద్రబాబు

- ఆంధ్రప్రదేశ్ నూతన లోకాయుక్తగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ మల్లిఖార్జునరావు
- విజయవాడలో ఆయనతో ప్రమాణం చేయించిన గవర్నర్ అబ్దుల్ నజీర్
- కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరు

- మిగతా 2లో






## కొండా సురేఖ మాజీ ఓఎస్డీ కేసు:
## జూబ్లీహిల్స్ సీఐపై వేటు

- మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ కేసులో జూబ్లీహిల్స్ సీఐ సస్పెండ్
- ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యం, నిందితుడిని పట్టుకోవడంలో విఫలమవడమే కారణం
- రియల్టర్‌పై హత్యాయత్నం కేసులో సుమంత్ ప్రధాన నిందితుడిగా ఉన్నాడు
- మంత్రి కుమార్తె వ్యాఖ్యల వివాదం కొనసాగుతుండగానే ఈ పరిణామం చోటుచేసుకుంది

- మిగతా 2లో

## 'గ్రేట్ గ్రీన్ వాల్' కార్యక్రమంలో భాగంగా తాటి వనాలను పెంచే కార్యక్రమం ప్రారంభమైంది

- తీరప్రాంతం వెంబడి 5,499 హెక్టార్లలో తాటి వానాలను ఏర్పాటు చేస్తున్నామన్న పవన్
- తుపాన్లు సంభవించినప్పుడు తీరప్రాంత గ్రామాలకు రక్షణ గోడలా పనిచేస్తాయని వెల్లడి
- కఠిన తీరప్రాంత వాతావరణాన్ని తట్టుకునే శక్తి తాటిచెట్లకు ఉందని వ్యాఖ్య

- మిగతా 2లో



## స్థానిక ఎన్నికలు స్వేచ్ఛగా జరిగితే
## వైసీపీదే విజయం

- స్థానిక ఎన్నికలు కేవలం గెలుపోటములకు మాత్రమే సంబంధించినవి కావన్న జగన్
- క్షేత్రస్థాయిలో శ్రమిస్తున్న కార్యకర్తలకు అండగా నిలబడాల్సిన సమయమని వ్యాఖ్య
- కుటుంబ సభ్యులను బరిలోకి దించేందుకు వెనుకాడవద్దని పిలుపు
- పోటీలు లేకుండా ఏకగ్రీవాలకు తావు ఇవ్వకూడదని హెచ్చరిక
- పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని వ్యాఖ్య



పెన్ పవర్ డెస్క్:స్థానిక సంస్థల ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగితే కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు స్పష్టమైన తీర్పు ఇస్తారని వైసీపీ అధినేత జగన్ ధీమా వ్యక్తం చేశారు. పార్టీ ముఖ్యనేతలతో ఈరోజు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని, రాబోయే స్థానిక ఎన్నికలపై దిశానిర్దేశం చేస్తూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికలు కేవలం గెలుపోటములకు సంబంధించినవి మాత్రమే కావని... క్షేత్రస్థాయిలో పార్టీ కోసం శ్రమిస్తున్న కార్యకర్తలకు అండగా

- మిగతా 2లో



## ఆరోగ్యం క్షీణించడంతో దీక్ష విరమించిన తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలకు డిమాండ్‌గా 48 గంటల దీక్షకు పిలుపు
- రక్తపోటు పడిపోవడంతో రెండో రోజే దీక్షను ముగించాలని సూచించిన సీనియర్ నేతలు
- నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేసిన ఎంపీ కె. లక్ష్మణ్
- రూ.15,000 కోట్ల బకాయిలతో 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారమన్న బీజేపీ

- మిగతా 2లో

## నేరం చేయకుండానే జైలు జీవితం..
## 'చంచల్‌గూడ'లో సరికొత్త అనుభవం!

- హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలులో 'తెలంగాణ జైల్ ఎక్స్‌పీరియన్స్'
- డబ్బులు చెల్లించి ఒక్కరోజు ఖైదీగా గడిపే వినూత్న అవకాశం
- ఖైదీల దుస్తులు, భోజనం.. క్రమశిక్షణతో కూడిన జైలు జీవితం
- ఆగస్ట్ 25 నుంచి సెప్టెంబర్ 30 వరకు అందుబాటులో జైల్ ఎక్స్‌పీరియన్స్

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

### బీసీలపై కక్ష సాధింపు వైసీపీదే.. మాది కాదు

ముఖ్యమంత్రి చంద్రబాబు బీసీల ఆత్మగౌరవ పరిరక్షకుడని, ఆయన నాయకత్వంలోనే బీసీలకు నిజమైన రాజకీయ, సామాజిక, ఆర్థిక సాధికారత లభించిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. అవినీతి, అక్రమాలకు సంబంధించిన కేసుల్లో చట్ట ప్రకారం దర్యాప్తు సంస్థలు చర్యలు తీసుకుంటుంటే, వాటిని బీసీలపై కక్ష సాధింపుగా చిత్రీకరించే నైతిక హక్కు వైసీపీ నేతలకు లేదని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. మంగళవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

**అవినీతి కేసులను బీసీలకు ఆపాదించొద్దు**

గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాలు ఇప్పుడు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయని అచ్చెన్నాయుడు అన్నారు. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును రాష్ట్ర ప్రభుత్వం అరెస్టు చేయలేదని, కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆధారాలతో చర్యలు తీసుకుందని గుర్తుచేశారు. కుటుంబ సభ్యుల ఖాతాల్లోకి నిధులు చేరినట్లు తేలడంతో చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటే, దానిని బీసీలపై కక్షగా ఎలా చెబుతారని ప్రశ్నించారు. అదేవిధంగా, మద్యం కేసుల్లో దర్యాప్తు ఎదుర్కొంటున్న జోగి రమేశ్ అరెస్టును కూడా చంద్రబాబు, లోకేశ్‌కు ఆపాదించడం రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నదేనని విమర్శించారు.

**గత ప్రభుత్వంలో బీసీలపై దమనకాండ కాదా?**

2019–24 మధ్యకాలంలో వైసీపీ ప్రభుత్వం బలహీన వర్గాలపై సాగించిన దమనకాండను ఆ పార్టీ నేతలు గుర్తు చేసుకోవాలని అచ్చెన్నాయుడు హితవు పలికారు. "నేను బీసీని కాదా? కొల్లు రవీంద్ర, అయ్యన్నపాత్రుడు బీసీలు కారా? వైసీపీ ప్రభుత్వ అరాచకాలను ప్రశ్నించినందుకే మాపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారు. ఒక్క పైసా అవినీతికి పాల్పడినట్లు ఆధారాలు చూపలేకపోయినా నన్ను 80 రోజులు జైలులో పెట్టారు. అప్పటి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాద్ ఆదేశాలతో నాపై హత్యాయత్నం కేసు పెట్టించారు. కొల్లు రవీంద్రపై హత్య కేసు, అయ్యన్నపాత్రుడిపై అత్యాచారం కేసు, యనమల రామకృష్ణుడుపై అట్రాసిటీ కేసులు పెట్టినప్పుడు బీసీలపై కక్ష గుర్తుకు రాలేదా?" అని అచ్చెన్నాయుడు నిలదీశారు.

**రిజర్వేషన్లు తగ్గించి బీసీలకు ద్రోహం చేసింది వైసీపీ**

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎన్టీఆర్ స్థానిక సంస్థల్లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే, చంద్రబాబు దానిని 34 శాతానికి పెంచి బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించారని అచ్చెన్నాయుడు గుర్తు చేశారు. అయితే, 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి కుదించిందని, దీనివల్ల బీసీలు సుమారు 16 వేల రాజకీయ పదవులను కోల్పోయారని ఆరోపించారు. "హైకోర్టు తీర్పు వ్యతిరేకంగా వస్తే, సుప్రీంకోర్టుకు వెళ్లకుండా బీసీలకు అన్యాయం చేసింది మీరు కాదా? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాకే వైసీపీ నేతలు బీసీల గురించి మాట్లాడాలి" అని ఆయన డిమాండ్ చేశారు.

## కొండా సురేఖ మాజీ ఓఎస్డీ కేసు: జూబ్లీహిల్స్ సీఐపై వేటు

రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ (ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ) ఎన్. సుమంత్‌కు సంబంధించిన కేసులో జూబ్లీహిల్స్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌పై వేటు పడింది. కేసు దర్యాప్తులో నిర్లక్ష్యం వహించారన్న ఆరోపణలతో స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్హెచ్ఓ) ముత్తు యాదవ్‌ను సస్పెండ్ చేస్తూ నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసును పోలీసులు చేపట్టిన చేసిన తీరుపై విచారణకు కూడా ఆదేశించారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారిపై దాడి కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న సుమంత్ ఇప్పటికీ పరారీలో ఉన్నాడు. ఈ కేసులో ఫస్ట్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఎఫ్ఐఆర్) నమోదు చేయడంలో జాప్యం జరిగిందని, నిందితుడిని పట్టుకోవడంలో సీఐ విఫలమయ్యారని తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలోనే ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి సుమంత్ డ్రైవర్‌ను పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

**కేసు నేపథ్యం ఏమిటి?**

బోడుప్పల్‌కు చెందిన రియల్టర్ గొంగిడి హరికృష్ణ ఫిర్యాదు మేరకు సుమంత్‌తో పాటు మరో ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తనపై ఇనుప రాడ్లు, కర్రలతో దాడి చేసి, రూ.10 కోట్లు డిమాండ్ చేశారని హరికృష్ణ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. జులై 30న రాము కార్యాలయంలో కలవాలని సుమంత్ కోరగా, అక్కడికి వెళ్లిన తనను దుర్భాషలాడుతూ ఇనుప రాడ్‌తో దాడి చేశాడని తెలిపారు. సుమంత్ ఆదేశాలతో మిగిలిన వారు కూడా దాడిలో పాలుపంచుకున్నారని వివరించారు. ఈ దాడిలో తన ఎడమ చేతికి ఫ్రాక్చర్ అయిందని, తీవ్ర రక్తస్రావంతో పాటు ఇతర గాయాలయ్యాయని, ఆగస్టు 10న శస్త్రచికిత్స చేయించుకున్నానని బాధితుడు పేర్కొన్నాడు.దఈ ఫిర్యాదు ఆధారంగా మల్కాజ్‌గిరి కమిషనరేట్ పరిధిలోని మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో సుమంత్, రాము, ప్రశాంత్, అరుణ్ కుమార్ రెడ్డి, కార్తీక్, మహేందర్ రెడ్డిలపై జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అనంతరం ఈ కేసును విచారణ నిమిత్తం హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. నిందితులపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 109 కింద హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలతో కాంగ్రెస్ పార్టీలో దుమారం రేగిన విషయం తెలిసిందే. ఈ వివాదం నడుస్తున్న తరుణంలోనే, మంత్రి మాజీ ఓఎస్డీపై తీవ్రమైన ఆరోపణలతో కేసు నమోదు కావడం, ఇప్పుడు ఆ కేసులో పోలీసు అధికారిపై వేటు పడటం చర్చనీయాంశంగా మారింది.

## గోదావరి పుష్కరాలపై సీఎం చంద్రబాబు సమీక్ష.. ఏర్పాట్లు అద్భుతంగా ఉండాలి!

- మొదటి పేజి తరువాయి

ముందుకు తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.పుష్కరాల కోసం రూ.4,026 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన 4,932 పనుల పురోగతిని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఘాట్ల నిర్మాణం, రహదారుల విస్తరణ, ఇతర మౌలిక వసతుల పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని చంద్రబాబు ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, పారదర్శకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, బీసీ జనార్ధన్ రెడ్డి, వై సత్యకుమార్ యాదవ్, గోదావరి పుష్కరాల ప్రత్యేకాధికారి, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో కూటమి ఐక్యతను కాపాడండి.. వైసీపీ డ్రామాలను నమ్మొద్దు: లోకేశ్

- మొదటి పేజి తరువాయి

కనేకల్ మండలం నల్లంపల్లిలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో లోకేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

**కార్యకర్తలే పార్టీకి బలం.. మీ ఫీడ్‌బ్యాక్‌కు విలువ**

"ఈ రోజు మేము మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా మీ ముందు నిలబడ్డామంటే దానికి కారణం కార్యకర్తల త్యాగాలు, శ్రమే. ముఖ్యంగా 2019–24 మధ్య కాలంలో వైసీపీ ప్రభుత్వ దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులను ఎదుర్కొని కూడా పసుపు జెండాను దించకుండా పోరాడిన మీరే పార్టీకి అసలైన బలం. అందుకే టీడీపీలో కార్యకర్తే అధినేత" అని లోకేశ్ అన్నారు. కార్యకర్తల సంక్షేమం కోసం దేశంలో ఏ పార్టీ చేయని విధంగా బీమా సౌకర్యం కల్పించి, ఇప్పటివరకు రూ.160 కోట్లు ఖర్చు చేశామన్నారు.

యువగళం పాదయాత్రలో కార్యకర్తలు కోరినట్లే, వారి అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇచ్చేందుకు 'మైటీడీపీ' యాప్‌ను తీసుకొచ్చామని తెలిపారు. "మీరు పాల్గొనే ప్రతి కార్యక్రమం, మీరు ఇచ్చే ఫీడ్‌బ్యాక్ నేరుగా మాకు చేరుతుంది. కొత్త పెన్షన్లు, ఇళ్ల మంజూరు వంటివి కార్యకర్తల ఫీడ్‌బ్యాక్ ఆధారంగానే ప్రభుత్వ దృష్టికి తీసుకెళుతున్నాం. కష్టపడే కార్యకర్తను మేమే వెతుక్కుంటూ వస్తాం. ఎక్కడైనా సమస్య పరిష్కారం కాకపోతే, మీకు అండగా నేనుంటాను" అని హామీ ఇచ్చారు.

**అనంతపురం అభివృద్ధి నా బాధ్యత**

ఉమ్మడి అనంతపురం జిల్లా టీడీపీకి కంచుకోట అని, తమ కుటుంబాన్ని ఎల్లప్పుడూ ఆదరించిందని లోకేశ్ గుర్తుచేసుకున్నారు. "ఎన్టీఆర్‌ను, హరిమామను, మా బాల మావయ్యను గెలిపించిన గడ్డ ఇది. ఈ అభిమానాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటాను. అనంతపురం జిల్లా అభివృద్ధి నా బాధ్యత" అని స్పష్టం చేశారు. సోలార్, విండ్ ఎనర్జీ, ఫైటర్ జెట్ తయారీ సంస్థ వంటి పరిశ్రమలతో యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఉరవకొండలో తయారయ్యే విండ్‌మిల్‌పై 'మేడ్ ఇన్ ఉరవకొండ' అని మంత్రి కేశవ్ సంకల్పం పెట్టుకున్నారని, ఇదే స్ఫూర్తితో ఎమ్మెల్యేలంతా తమ నియోజకవర్గాల అభివృద్ధికి పోటీ పడాలని సూచించారు. ఈ సందర్భంగా, కనేకల్‌కు డిగ్రీ కళాశాల మంజూరు చేసే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు.

**గొడ్డలి పార్టీవి డ్రామాలే.. అసెంబ్లీకి రా జగన్!**

వైసీపీపై లోకేష్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "గొడ్డలి పార్టీతో మనం రాజకీయంగా పోరాడుతున్నాం. సొంత బాబాయ్‌ని హత్య చేసి, ఆ నిందను ఇతరులపై వేయడం వారి నైజం. కోడికత్తి, గులకరాయి డ్రామాలు ప్రజలు ఇంకా మర్చిపోలేదు. ఇప్పుడు లిక్కర్ స్కామ్‌లో వారి మాజీ మంత్రిని ఈడీ అరెస్ట్ చేస్తే, దానికి కూడా మమ్మల్ని నిందిస్తున్నారు" అని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా మాజీ సీఎం జగన్‌కు ఆయన సవాల్ విసిరారు.

"డీఎస్సీ, ఏపీపీఎస్సీకి తేడా తెలియని జగన్, డీఎస్సీపై చర్చకు సిద్ధమా? టైమ్, డేట్, లొకేషన్ నువ్వే ఫిక్స్ చెయ్. ప్రెస్‌మీట్లు కాదు, దమ్ముంటే అసెంబ్లీకి రా. పులివెందుల ప్రజలు నిన్ను గెలిపించింది వారి సమస్యలు సభలో ప్రస్తావించడానికే. కానీ రెండేళ్లలో ఒక్కసారి ప్రమాణ స్వీకారానికి వచ్చి వెళ్లిపోయావు. పులివెందుల ప్రజల కోసమైనా అసెంబ్లీకి రా" అని లోకేశ్ సవాలు చేశారు.

**కూటమి ఐక్యతను కాపాడాలి**

కూటమిలో చిచ్చు పెట్టేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని లోకేష్ హెచ్చరించారు. "జనసేన, బీజేపీ పేరుతో టీడీపీని తిడుతూ సోషల్ మీడియాలో ఫేక్ పోస్టులు పెడుతున్నారు. వాటిని నమ్మి ఆవేశపడొద్దు. మనమంతా ఐక్యంగా ఉండి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించాలి. గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఒకే ప్రభుత్వం ఉంటేనే అభివృద్ధి వేగంగా సాధ్యమవుతుంది" అని దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా, సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తూ ముందుకు వెళుతున్నామని, ఇప్పటికే 16 వేల టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తి చేశామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, ఇతర పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 'గ్రేట్ గ్రీన్ వాల్' కార్యక్రమంలో భాగంగా తాటి వనాలను పెంచే కార్యక్రమం ప్రారంభమైంది

రాష్ట్రంలోని సుదీర్ఘ తీరప్రాంతానికి సహజమైన రక్షణ కవచాన్ని ఏర్పరచేందుకు 'గ్రేట్ గ్రీన్ వాల్' ప్రాజెక్టులో భాగంగా తాటివనాలను పెంచే ప్రక్రియను ప్రారంభించినట్లు ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెల్లడించారు. తీరప్రాంతం వెంబడి సుమారు 5,499 హెక్టార్ల పరిధిలో ఈ తాటి వనాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు.ప్రస్తుతం తాటికాయల సీజన్ నడుస్తుండటంతో, అటవీశాఖ ద్వారా తాటి గింజలను సేకరించి తీరప్రాంతాల్లో నాటే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రకృతి విపత్తులు, తుపాన్లు సంభవించినప్పుడు ఉగ్రరూపం దాల్చే ఈదురుగాలుల నుంచి తీరప్రాంత గ్రామాలకు ఈ తాటివనాలు ఒక సహజ రక్షణ గోడలా పనిచేస్తాయని పవన్ కల్యాణ్ తెలిపారు.

తీరప్రాంతాల్లో ప్రత్యేకంగా తాటిచెట్లనే ఎంచుకోవడానికి గల కారణాలను వివరిస్తూ... ఉప్పునీరు, హోరు గాలులు ఉండే కఠినమైన తీరప్రాంత వాతావరణాన్ని తట్టుకుని నిలబడే శక్తి తాటిచెట్లకు మాత్రమే ఉంటుందన్నారు. ఇసుక, బుసక, ఉప్పు నేలలతో పాటు ఒండ్రు నేలల్లో సైతం ఇవి పెరుగుతాయని పేర్కొన్నారు. తాటిచెట్లు బాగా ఎత్తుగా పెరిగే లక్షణం కలిగి ఉండటం వల్ల సముద్ర గాలులను సమర్థవంతంగా అడ్డుకుంటాయని, అంతేకాకుండా వీటి వేర్లు నేలను బలంగా పట్టి ఉంచడం ద్వారా తీరం కోతకు గురికాకుండా కాపాడుతాయని ఉపముఖ్యమంత్రి వివరించారు.

## నేరం చేయకుండానే జైలు జీవితం.. 'చంచల్‌గూడ'లో సరికొత్త అనుభవం!

జైలు జీవితాన్ని ప్రత్యక్షంగా అనుభవించాలనుకునే వారికి తెలంగాణ జైళ్ల శాఖ ఒక వినూత్న అవకాశాన్ని కల్పిస్తోంది. హైదరాబాద్‌లోని 150 ఏళ్ల చారిత్రక నేపథ్యం కలిగిన చంచల్‌గూడ జైలులో 'తెలంగాణ జైల్ ఎక్స్‌పీరియన్స్' పేరుతో ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. జైలు వాతావరణం, అక్కడ అమలు చేస్తున్న సంస్కరణలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం.ఈ కార్యక్రమం 2026 ఆగస్ట్ 25 నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. గతంలో 2026 మే నెలలో 'ఫీల్ ది జైల్' పేరుతో ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని, ప్రజాదరణ దృష్ట్యా ఇప్పుడు మరోసారి నిర్వహిస్తున్నారు. 18 ఏళ్లు నిండిన పౌరులు ఎవరైనా ఈ ప్రక్రియలో స్వచ్ఛందంగా పాల్గొనవచ్చు.ఈ కార్యక్రమంలో పాలుపంచుకునే వారు తమ మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను నిబంధనల ప్రకారం వెలుపలే అప్పగించి, ఖైదీలకు కేటాయించే యూనిఫాం ధరించాల్సి ఉంటుంది. వీరి దినచర్య ఉదయం 6 గంటలకే ప్రారంభమవుతుంది. వ్యాయామం, యోగా, పరేడ్‌తో పాటు టైలరింగ్, వ్యవసాయం, పారిశుధ్యం వంటి పనుల్లో వీరు భాగస్వాములు కావాలి. సాధారణ ఖైదీలకు వడ్డించే భోజనాన్నే వీరికి కూడా స్టీల్ ప్లేట్లు, గ్లాసుల్లోనే అందిస్తారు.

ఈ విలక్షణ అనుభవం కోసం అధికారులు వివిధ ప్యాకేజీలను రూపొందించారు. 4 గంటల సమయానికి రూ. 500, 8 గంటలకు రూ. 750, 12 గంటలకు రూ. 1,000, 24 గంటల ప్యాకేజీకి రూ. 1,500 రుసుముగా నిర్ణయించారు. రాత్రి బస చేసే వారికి ప్రత్యేక బ్యారక్‌లను కేటాయిస్తారు. ఆసక్తి ఉన్నవారు తెలంగాణ జైళ్ల శాఖ అధికారిక వెబ్‌సైట్ లేదా 'బుక్‌మైషో' ద్వారా తమ టికెట్లను బుక్ చేసుకోవచ్చు. వీటితో పాటు రూ. 10 ప్రవేశ రుసుముతో జైలు మ్యూజియంను సందర్శించే వెసులుబాటు కూడా ఉంది.

## రాయలసీమకు సుజ్లాన్ భరోసా.. రూ.10 వేల కోట్ల ప్రాజెక్టుకు మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన

- మొదటి పేజి తరువాయి

హలకుంది గ్రామంలో ఉన్న సుజ్లాన్ బ్లేడ్ స్టాక్ యార్డును మంత్రి సందర్శించి, అక్కడి విండ్ టర్బైన్‌పై తన సంతకం చేశారు.

ఈ సందర్భంగా సుజ్లాన్ ప్రతినిధులు ప్రాజెక్టు విశేషాలను మంత్రికి వివరించారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో 1,700 మెగావాట్లకు పైగా స్థాపిత సామర్థ్యంతో అతిపెద్ద విండ్ భాగస్వామిగా ఉన్న సుజ్లాన్, తన కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. 2030 నాటికి రాష్ట్రంలో అదనంగా మరో 5,000 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను స్థాపించడమే లక్ష్యంగా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. పవన విద్యుత్ ఉత్పత్తిలో ఏపీని కీలక కేంద్రంగా మార్చేందుకు ఈ ప్రాజెక్టులు దోహదపడతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కీలక కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, అనంతపురం ఎంపీ అంబికా జి. లక్ష్మీనారాయణ, స్థానిక ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు (రాయదుర్గం), అమిలినేని సురేంద్రబాబు (కల్యాణదుర్గం), దగ్గుపాటి వెంకట ప్రసాద్ (అనంతపురం అర్బన్) పాల్గొన్నారు. సుజ్లాన్ గ్రూప్ తరపున కో–ఫౌండర్, వైస్ ఛైర్మన్ గిరీష్ తంతి, సీఈవో అజయ్ కపూర్, అడ్వైజర్ వి.బి. రావు, ఇతర భాగస్వామ్య సంస్థలైన టాటా పవర్ ఎండీ సంజయ్ బంగా, టొరెంట్ పవర్ డైరెక్టర్ జిగీష్ మెహతా, వారీ ఎనర్జీస్ సీఎండీ హితేష్ దోషి, ఎన్ఆర్ఈడీసీఏపీ లిమిటెడ్ వీసీ, ఎండీ ఎమ్. కమలాకర బాబు, జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ తదితర ప్రముఖులు హాజరయ్యారు.

## స్థానిక ఎన్నికలు స్వేచ్ఛగా జరిగితే వైసీపీదే విజయం

- మొదటి పేజి తరువాయి

నిలబడాల్సిన కీలక సమయమని జగన్ పేర్కొన్నారు. గతంలో జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపాలిటీ ఎన్నికల్లో అధికార దుర్వినియోగం, దౌర్జన్యాలు చూశామన్న ఆయన.. ఈసారి ప్రతి స్థానంలోనూ సమర్థులైన, బలమైన అభ్యర్థులను పోటీకి దింపాలని సూచించారు. అవసరమైతే నాయకులు తమ కుటుంబ సభ్యులను సైతం బరిలోకి దించేందుకు వెనకాడకూడదని పిలుపునిచ్చారు. ఏ నియోజకవర్గంలోనూ పోటీ లేకుండా ఏకగ్రీవాలకు తావు ఇవ్వకూడదని... ఒకవేళ ఎక్కడైనా ఏకగ్రీవాలు జరిగితే అక్కడి కో–ఆర్డినేటర్లు భవిష్యత్తులో అసెంబ్లీ అభ్యర్థులుగా కొనసాగలేరని హెచ్చరించారు.పార్టీ కేడర్ బలోపేతం కోసం 14 నుంచి 15 లక్షల క్యూఆర్ కోడ్ ఆధారిత గుర్తింపు కార్డులు సిద్ధమయ్యాయని... సెప్టెంబరు 5 నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహించి వీటిని పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. 'వెన్నుపోటు పార్టీ –– వెన్నుపోటు పాలన' అనే నినాదంతో గ్రామ స్థాయిలో వైసీపీ – కూటమి పాలన మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరిస్తూ ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు.కార్యకర్తలను రక్షించుకోవడానికి నియోజకవర్గ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు లీగల్, మీడియా సెల్స్‌ను బలోపేతం చేయాలని... అవసరమైతే కేసులు హైకోర్టు వరకు తీసుకెళ్లేలా సమన్వయ వ్యవస్థ ఉండాలని తెలిపారు. అలాగే సోషల్ మీడియాను పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని, 'జగన్ 2.0 సూపర్ యాప్', యూట్యూబ్, ఎక్స్ వంటి వేదికల ద్వారా నిజాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరుతూ, రాజకీయ ఒత్తిళ్లతో చట్టవిరుద్ధంగా వ్యవహరించే అధికారుల పేర్లను డిజిటల్ బుక్‌లో నమోదు చేసి, భవిష్యత్తులో చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాయకులు తమ ఈగోలను పక్కనపెట్టి, రాబోయే 60–70 రోజులు నియోజకవర్గాల్లోనే ఉంటూ స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## ఏపీ లోకాయుక్తగా జస్టిస్ మల్లిఖార్జునరావు ప్రమాణ స్వీకారం..

ఆంధ్రప్రదేశ్ నూతన లోకాయుక్తగా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లిఖార్జునరావు బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని లోక్‌భవన్‌లో మంగళవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరై, నూతన లోకాయుక్తగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ మల్లిఖార్జునరావుకు పుష్పగుచ్ఛం అందించి హృదయపూర్వకంగా అభినందనలు తెలిపారు.ప్రమాణ స్వీకారం ముగిసిన అనంతరం జస్టిస్ మల్లిఖార్జునరావు, ముఖ్యమంత్రి చంద్రబాబు, గవర్నర్ అబ్దుల్ నజీర్ కాసేపు ముచ్చటించారు. పరిపాలనలో పారదర్శకత, అవినీతి నిర్మూలనకు లోకాయుక్త వ్యవస్థ ప్రాధాన్యాన్ని ఈ సందర్భంగా వారు గుర్తుచేసుకున్నారు. అనంతరం లోక్‌భవన్‌లో ఏర్పాటు చేసిన అల్పాహార విందులో గవర్నర్, ముఖ్యమంత్రి పాల్గొన్నారు.ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులు, న్యాయశాఖకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. జస్టిస్ మల్లిఖార్జునరావు నియామకంతో రాష్ట్రంలో పరిపాలన మరింత జవాబుదారీగా మారుతుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేశారు.

## రేవంత్ రెడ్డితో దేశ భద్రతకు ముప్పు.. ఎంపీ అర్వింద్ సంచలన వ్యాఖ్యలు

అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడంపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ తీవ్రంగా తప్పుబట్టారు. రేవంత్ రెడ్డి వ్యవహారశైలి రాష్ట్ర శాంతిభద్రతలకే కాకుండా దేశ భద్రతకు కూడా ముప్పుగా మారుతోందని ఆరోపించారు.విదేశీ పర్యటనల్లో రేవంత్ రెడ్డి దేశ వ్యతిరేక శక్తులతో చేతులు కలుపుతున్నారని అర్వింద్ విమర్శించారు. విదేశాల్లో దేశంపై విషం చిమ్మే వారితో మాట్లాడటం ద్వారా రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ కంటే రేవంత్ రెడ్డి ప్రమాదకరమైన వ్యక్తి అని తాను గతంలోనే చెప్పానని, ఇకపై ఆయన ప్రతి కదలిక జాతీయ భద్రతా సంస్థల పరిశీలనలో ఉంటుందని వ్యాఖ్యానించారు.మరోవైపు రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై కూడా అర్వింద్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బకాయిలు చెల్లించకపోవడంతో విద్యాసంస్థలు మూతపడే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. బకాయిలను క్లియర్ చేస్తామని రాహుల్ గాంధీతో హామీ ఇప్పించినా ఆ హామీ అమలు కాలేదని విమర్శించారు.రాష్ట్రంలోని విద్యాసంస్థలను పట్టించుకోకుండా విదేశాల నుంచి కొత్త విద్యాసంస్థలను తీసుకొస్తామని చెప్పడం ఏంటని అర్వింద్ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డికి పరిపాలన చేతకాదని తెలంగాణ ప్రజలు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చారని అన్నారు.

## ఆరోగ్యం క్షీణించడంతో దీక్ష విరమించిన తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు

తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన 48 గంటల నిరాహార దీక్షను రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు రెండో రోజే విరమించారు. దీక్షలో ఉండగా ఆయన ఆరోగ్యం క్షీణించడంతో, పార్టీ సీనియర్ నేతల సూచన మేరకు మంగళవారం దీక్షను ముగించారు.సోమవారం ప్రారంభమైన ఈ దీక్షలో రాంచందర్ రావు ఆరోగ్యం మంగళవారం క్షీణించింది. ఆయన రక్తపోటు (బీపీ) గణనీయంగా పడిపోవడంతో పార్టీ శ్రేణులు ఆందోళనకు గురయ్యాయి. దీంతో, సీనియర్ నేతలు దీక్షను విరమించాలని ఆయనకు సూచించారు. అనంతరం, పార్టీ సీనియర్ నేత, ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్.. రాంచందర్ రావుకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు.అంతకుముందు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ శాసనసభా పక్ష నేత మహేశ్వర్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఇతర నేతలు దీక్షా శిబిరానికి వచ్చి రాంచందర్ రావుకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థుల భవిష్యత్తు గురించి ఆలోచించాలని హితవు పలికారు.

**కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు**

దీక్ష విరమించడానికి ముందు రాంచందర్ రావు 'ఎక్స్' వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. "తెలంగాణ విద్యార్థుల గొంతుక.. 58 ఏళ్ల యువ నేతగా చెప్పుకునే వ్యక్తికి కానీ, హైదరాబాద్‌లోని ఆయన గులాంకు కానీ వినిపించడం లేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం కావడంతో 40 లక్షల మంది విద్యార్థులు ఉన్నత చదువులకు, ఉద్యోగాలకు దూరమవుతున్నారు" అని ఆయన ఆరోపించారు.దాదాపు రూ.15,000 కోట్ల బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "యువతకు తామే సంరక్షకులమని చెప్పుకోవడం కాంగ్రెస్ పార్టీకి ఉన్న ఓ బూటకం. తెలంగాణ యువత మేల్కొంది, ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉంది" అని రాంచందర్ రావు హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రాష్ట్ర విద్యావ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని, రేపు ఇదే యువత ప్రభుత్వాన్ని గద్దె దింపుతుందని ఆయన అన్నారు.



# ఆ.. ఊరు.. కన్నీటి వీడ్కోలు..!



## పుట్టిన ఊరును వీడుతున్న వెలుగొండ నిర్వాసితులు.

## గ్రామస్తుల్ని కదిలిస్తే.. కన్నీటి గాథలే

## ఈనెల 26 నాటికి ఊరంతా ఖాళీ చేయాల్సిందే.

**పెన్ పవర్, కంభం, అర్ధవీడు ఆగస్టు 25**

వెలిగొండ ప్రాజెక్టు ముంపు కారణంగా ప్రజలు తమ పుట్టిన ఊళ్లను కన్నీటితో వీడు వెళుతున్నారు. ఒకవైపు అధికారుల హెచ్చరికలు మరోవైపు పోలీసుల హెచ్చరికల తో గ్రామాన్ని విడాల్సిన పరిస్థితులు రానే వచ్చాయి. అర్ధవీడు మండలంలోని మాగుటూరు పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం, కృష్ణానగర్ వాసులు తమ గ్రామాలను వీడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొందరు ఖాళీ చేసి వెళుతుండగా మరికొందరు తమకు పైసలు పడలేదు మహాప్రభో అని వేడుకొన్నారు. అయినా ఎలాంటి ఫలితం లేదు. ఈనెల 26 లోపల గ్రామాలు ఖాళీ చేయాల్సిందేనని అధికారులు ఆ గ్రామస్తులకు తేల్చి చెప్పారు. ఆర్ఆర్ ప్యాకేజీ పొందిన నిర్వాసితులు కట్టుకున్న ఇల్లు సాగు చేసిన పొలాలు పుట్టిన ఊరుని వదిలి పట్టణాలు గ్రామీణ ప్రాంతాల బాట పట్టారు .ఈ వీడ్కోలు దృశ్యాలు స్థానికంగా అందర్నీ కంటతడి పెట్టిస్తున్నాయి. ఇప్పటికిప్పుడు వెళ్లి ఎక్కడ జీవించాలో పశువులను తీసుకెళ్లి ఎక్కడ ఉంచాలో అర్థం కాక ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. కొంతమంది ఇప్పటికే ఇళ్లను అద్దెకు చూసుకొని ఆయా ప్రాంతాలకు తరలి వెళ్ళిపోతున్నారు. కొందరు గ్రామాలను వీడలేక కన్నీరు పెడుతున్నారు. కొన్నేళ్లుగా చిన్న గ్రామమైన తమ జీవనం కొనసాగించిన వారు ఒక్కో కుటుంబంగా పొలిమేర దాడుతున్నారు. ఇలా సగానికి పైగా వెళ్లిపోయారు .తమ భూములు ప్రస్తుతం సాగులో ఉన్నాయని వాటిని చూసుకొని కొంత సమయం ఇస్తే పోతామని మరికొందరు బీస్మించినా ఎలాంటి ఫలితం లేదు. కాగా గ్రామస్తులంతా వ్యవసాయ కుటుంబీకులు. ఒక్కసారిగా గ్రామాన్ని వెనక్కి తిరిగి చూసి ఇక రానని కన్నీరు పెట్టుకొని బరువెక్కిన గుండెతో విడాల్సిన పరిస్థితి వచ్చిందని వారు పేర్కొన్నారు.

**కాకర్ల గ్యాప్ నీరు చేరితే..!**

వెలిగొండ ప్రాజెక్టు పరిధిలోని కాకర్ల గ్యాప్ నీరు చేరితే లక్ష్మీపురం కృష్ణానగర్ గ్రామాలు ముంపు గ్రామాలుగా చేరాయి .

**కాకర్ల నుండి వెలగల పాయకు రవాణా వ్యవస్థ బంద్..!**

కంభం నుండి వయా కాకర్ల వెలగలపాయ వరకు వెళ్లే రవాణా వ్యవస్థ పూర్తిగా నిలిచిపోనుంది. నూతనంగా నిర్మించిన రహదారి గుండా శంకరాపురం నుండి వెళ్లాల్సిన పరిస్థితి వస్తుందని ఆయా గ్రామస్తులు భావిస్తున్నారు. ఏది ఏమైనా కొంత ప్రయాణభారం దూరమవుతుందని కొన్ని ఇబ్బందులు తప్పవని మాగుటూరు రంగాపురం గన్నేపల్లి వెలగలపాయ బొమ్మి లింగం పలు గ్రామాల ప్రజలు పెదవిరుస్తున్నారు. కాకర్ల గ్యాప్ నిండితే కొన్ని గ్రామాల ప్రజలకు పూర్తి ఇబ్బందిగా ఉంటాయని భావిస్తున్నారు.

# పెన్ పవర్


MARKAPURAM మార్కాపురం

## మార్కాపురం - ప్రకాశం

# భూముల రీ సర్వేపై అధికారులకు సీసీఎల్ఏ జయలక్ష్మి దిశా నిర్దేశం

## ప్రభుత్వ ఉత్తర్వులు, సర్క్యులర్ల పై రెవెన్యూ అధికారులకు అవగాహన అవసరం - కలెక్టర్ పి.






**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 25**

భూముల రీ సర్వే, పి జి ఆర్ ఎస్, 22 ఏ తదితర అంశములు పై సీసీఎల్ఏ, స్పెషల్ సీఎస్ టు గవర్నమెంట్ జయలక్ష్మి దిశా నిర్దేశం చేశారు. మంగళవారం ఉదయం అమరావతి నుంచి సీసీఎల్ఏ, స్పెషల్ సీఎస్ టు గవర్నమెంట్ జయలక్ష్మి జిల్లా కలెక్టర్ లతో నిర్వహించిన వీక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పి రాజబాబు క్యాంపు కార్యాలయం నుండి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ జీవోలు 444,445 లపై, సర్కులర్లపై మండల రెవెన్యూ అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారికి సూచించారు. అదే విధంగా రెవెన్యూ కాన్ఫరెన్స్ కూడా ఏర్పాటు చేయాలన్నారు. రెవెన్యూ డివిజనల్ అధికారులు ఎప్పటికప్పుడు ఆయా గ్రామాలలో తిరిగి మండల రెవెన్యూ అధికారి లాగిన్స్ లో పి జి ఆర్ ఎస్ పెండింగ్ లేకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అక్టోబర్ నెల వరకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలని తదనుగుణంగా ఒక సమగ్ర ప్రణాళిక రూపొందించుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. భూముల రీ సర్వే, పిజిఆర్ఎస్ లలో వెనుకంజలో ఉన్న మండలాల రెవెన్యూ అధికారులపై, అలసత్వం వహించిన అధికారులపై శాఖ పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రీ సర్వే పూర్తి చేసిన గ్రామాలలో పట్టాదారు పాస్ పుస్తకాలు సత్వరమే అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రెవెన్యూ డివిజన్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి వెంకటరమణ, పి జి ఆర్ ఎస్ పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.

# జీ జీ హెచ్ లో 14 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

## - ఈ నెల 28 న మంత్రి లోకేష్ చేతుల మీదుగా భూమి పూజ

## - మెరుగుపడనున్న మౌలిక సౌకర్యాలు - సూపరింటెండెంట్ డా. ఎస్. మాణిక్య రావు






**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 25**

ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల (జిజిహెచ్)లో రోగులు, వారి సహాయకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు రూ.14. కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఈ నెల 28న రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ భూమి పూజ చేయనున్నట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. మాణిక్య రావు ఒక ప్రకటనలో తెలియజేశారు. జిల్లా కలెక్టర్ పి రాజా బాబు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు ప్రత్యేక చొరవతో ఈ అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు మంజూరయ్యాయని సూపరింటెండెంట్ తెలిపారు. వారి కృషి, సహకారంతోనే ఈ పనులకు భూమిపూజ కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. జీజీహెచ్‌లో పెరుగుతున్న రోగుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఓపీ రిజిస్ట్రేషన్ బ్లాక్, రోగుల సహాయకుల కోసం వెయిటింగ్ బ్లాక్, మార్చురీ వద్ద సహాయకుల కోసం షెడ్ నిర్మించనున్నారు. అలాగే ఆసుపత్రిలోని అన్ని బ్లాకులకు సమానంగా నీరు అందించేందుకు 90 కెఎల్డీ సామర్థ్యంతో ఒహెచ్బిఆర్, ఆర్సిసి కలెక్టింగ్ సంప్ నిర్మించనున్నారు. పెరుగుతున్న వాహనాల సంఖ్యకు అనుగుణంగా ఆసుపత్రి ప్రాంగణంలోని వివిధ ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్ షెడ్లు ఏర్పాటు చేయనున్నారు. నర్సింగ్ విద్యార్థులకు కొత్త హాస్టల్ నిర్మాణం పూర్తయ్యే వరకు తాత్కాలిక వసతి కల్పించేందుకు బ్లాక్-1ఏలో 4వ అంతస్తులో వార్డు బ్లాక్‌ను ఏర్పాటు చేయనున్నారు. 2008 లో నిర్మించిన ప్రధాన ఆసుపత్రి భవనానికి అవసరమైన అభివృద్ధి, నిర్వహణ పనుల్లో భాగంగా ప్రధాన భవనం ముందు భాగంలో ఏసిపి క్లాడింగ్, పోర్టికో ఫ్లోరింగ్ మార్పు, ఓపీ ప్రాంతం పునరుద్ధరణ, నాలుగు ఓటిఎస్ ప్రాంతాలకు రూఫింగ్ వంటి పనులు చేపట్టనున్నారు. ఈ మొత్తం పనులకు రూ.14. కోట్ల అంచనా వ్యయం కాగా, డిఎంఎఫ్ నిధుల నుంచి రూ.10 కోట్లు మంజూరయ్యాయి. మిగిలిన రూ.4. కోట్లను జిజిహెచ్ వద్ద అందుబాటులో ఉన్న నిధుల నుంచి సమకూర్చనున్నారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయితే జీజీహెచ్‌కు వచ్చే వేలాది మంది రోగులు, వారి సహాయకులకు మెరుగైన రిజిస్ట్రేషన్, వేచి ఉండే ప్రదేశాలు, నీటి వసతి, పార్కింగ్, వసతి, ఇతర మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని డాక్టర్ ఎస్. మాణిక్య రావు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో డాక్టర్ నామినేని. కిరణ్ కుమార్, సిఎస్ఆర్ఎంఓ డాక్టర్ మాధవీలత పాల్గొన్నారు.

# ఎంఐజి లేఅవుట్ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే నాగేశ్వరరావు

**కందుకూరు పెన్ పవర్ ఆగస్టు 25**





పట్టణంలో నుడా ఆధ్వర్యంలో జరుగుతున్న ఎంఐజి లేఅవుట్ అభివృద్ధి పనులను కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం సాయంత్రం పరిశీలించారు. విశాలంగా నిర్మిస్తున్న రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను మున్సిపల్ కమిషనర్ కే. అనూష, డిఈ గణపతి, ఇతర అధికారులు, పార్టీ నేతలతో కలిసి పరిశీలించారు. 290 ప్లాట్లుగా విభజించిన లేఅవుట్ లో మౌలిక వసతుల కోసం మొదటి విడతగా 9 కోట్ల రూపాయలు మంజూరు కాగా, పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఈ పనులు చేయిస్తున్నారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనుల్లో రాజీ పడకుండా, నాణ్యతగా ఉండేలా చూడాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. సిసి రోడ్లు, డ్రైనేజీ పనులు ముగిసిన వెంటనే లేఅవుట్ చుట్టూ ప్రహరీ నిర్మాణాన్ని కూడా ప్రారంభించాలని సూచించారు. గత ప్రభుత్వంలో లేఅవుట్ ను నిర్లక్ష్యంగా వదిలేశారని, కూటమి ప్రభుత్వంలో లేఅవుట్ కు తిరిగి ప్రాణం పోశామని ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలియజేశారు. సదరు స్థలాన్ని 22 ఎ నుంచి తప్పించి, మోడల్ లేఅవుట్ గా తీర్చిదిద్దేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఎమ్మెల్యే వెంట పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, రూరల్ అధ్యక్షుడు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, పట్టణ మాజీ అధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు, రూరల్ మాజీ అధ్యక్షుడు నార్నే రోశయ్య, కాంట్రాక్టర్ చల్లా నాగేశ్వరరావు, స్థానిక నాయకులు గడ్డం మాలకొండయ్య, పువ్వాడి కోటయ్య, భవనాసి వెంకటేశ్వర్లు, పొడపాటి మాధవ, కూనం నరేంద్ర, ముచ్చు వేణు, యర్రా ముసలయ్య, పులి నాగరాజు, పలువురు నాయకులు ఉన్నారు.



# ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రికెట్ పిచ్ నిర్మాణం

## గ్రామీణ క్రీడాకారుల ప్రతిభకు వేదిక

## యువత సొంత నిధులతో నిర్మాణానికి శ్రీకారం

## విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం



**సంతమాగులూరు, పెన్ పవర్, ఆగస్టు 25**

గ్రామీణ ప్రాంత విద్యార్థులు, యువ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఏల్చూరు యువత చేపట్టిన చొరవ అభినందనీయంగా నిలిచింది. సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో విద్యార్థులు, యువకులు క్రికెట్ సాధన చేసుకునేందుకు అవసరమైన సిమెంట్ పిచ్ నిర్మాణాన్ని యువత స్వచ్ఛందంగా చేపట్టింది. ప్రభుత్వ నిధుల కోసం ఎదురుచూడకుండా తమ సొంత నిధులతో నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. మంగళవారం పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రామచంద్రరావు, ఉపాధ్యాయ బృందం కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు.

**క్రీడా నైపుణ్యాలకు ప్రోత్సాహం**

ఏల్చూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల్లో విద్యతో పాటు క్రీడా ప్రతిభను పెంపొందించేందుకు మంచి అవకాశాలు ఉన్నాయి. అయితే క్రికెట్‌లో నిత్య సాధన చేసేందుకు అనువైన పిచ్, ఇతర మౌలిక సదుపాయాల కొరత ఉండేది. దీనిని గుర్తించిన గ్రామ యువత విద్యార్థులకు మెరుగైన సాధన వేదిక కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టింది.

**నాణ్యమైన సాధనకు పిచ్ కీలకం**

క్రికెట్‌లో బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలంటే నిరంతర సాధన ఎంతో అవసరం. ముఖ్యంగా సిమెంట్ పిచ్ అందుబాటులో ఉండటం వల్ల బంతి వేగం, బౌన్స్‌ను అంచనా వేయడం, బ్యాటింగ్ టైమింగ్, బౌలింగ్ నియంత్రణ వంటి అంశాల్లో విద్యార్థులు మెరుగైన నైపుణ్యాన్ని సాధించే అవకాశం ఉంటుంది.

**క్రమశిక్షణకు క్రీడలు దోహదం**

క్రీడలు విద్యార్థుల్లో శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, సమయపాలన, ఆత్మవిశ్వాసం, జట్టుగా పనిచేసే లక్షణాలను పెంపొందిస్తాయి. గ్రామీణ ప్రాంతాల్లో చిన్న వయసులోనే క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే మండల, జిల్లా స్థాయిలోనే కాకుండా రాష్ట్ర స్థాయిలోనూ రాణించే అవకాశాలు ఉంటాయి.

**పాఠశాలకు మరింత గుర్తింపు**

క్రికెట్ పిచ్ అందుబాటులోకి రావడంతో ఏల్చూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిత్య సాధనకు మెరుగైన అవకాశం లభించనుంది. పాఠశాల స్థాయి పోటీలతో పాటు మండల, జిల్లా స్థాయి క్రీడా పోటీలకు విద్యార్థులను సిద్ధం చేసేందుకు ఈ వసతి ఎంతో ఉపయోగపడుతుందని ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పేర్కొన్నారు.

**యువత చొరవకు ప్రశంసలు**

పాఠశాల విద్యార్థులతో పాటు గ్రామంలోని యువ క్రీడాకారులు కూడా ఈ పిచ్‌ను వినియోగించుకునే అవకాశం ఉండటంతో ఏల్చూరులో క్రీడా వాతావరణం మరింత బలోపేతం కానుంది. పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములవుతూ, క్రీడలకు అవసరమైన వసతిని తమ సొంత నిధులతో ఏర్పాటు చేస్తున్న ఏల్చూరు యువత చొరవపై మండలవ్యాప్తంగా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. ఇతర గ్రామాల యువత కూడా ఇదే తరహాలో పాఠశాలల అభివృద్ధికి ముందుకు రావాలని పలువురు ఆకాంక్షించారు.

# కందుకూరులో 27న మెగా జాబ్ మేళా

-15కు పైగా ప్రముఖ సంస్థల్లో ఉద్యోగావకాశాలు

-యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పిలుపు




**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 25**

కందుకూరు నియోజకవర్గ నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ నెల 27న కందుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. కందుకూరు శాసన సభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నైపుణ్యాభివృద్ధి, ఉపాధి శిక్షణ శాఖల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మెగా జాబ్ మేళాకు సంబంధించిన గోడ పత్రాలను మంగళవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో పాల్గొని అందుబాటులో ఉన్న ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# పొలంలో కూలీ పనికి వెళ్లి పాము కాటుకు గురై అనంతలోకాలకు

గిద్దలూరులో విషాదం.. పాము కాటుతో మహిళ మృతి



**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 25**

గిద్దలూరు పట్టణం నల్లబండ బజారుకు చెందిన పందనబోయిన విజయలక్ష్మి (45) పాము కాటుకు గురై మృతి చెందిన సంఘటన మంగళ వారం చోటుచేసుకుంది. దిగువ మెట్ట సమీపంలోని పెద్దచెరువు పొలాల్లో చిక్కుడు కాయలు కోస్తుండగా ఆమెను పాము కాటేసింది. తీవ్ర విష ప్రభావంతో సంఘటనా స్థలంలోనే విజయలక్ష్మి మృతి చెందింది. తోటి కూలీలు గమనించి వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆసుపత్రికి తరలించేలోపే ఆమె మృతి చెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. ఈ ఘటనతో నల్లబండ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పొట్టకూటి కోసం కూలీ పనులకు వెళితే పాము కాటుకు గురై అనంతలోకాలకు వెళ్ళింది.

దీంతో నల్లబండ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# నారాయణస్వామి హుండీ ఆదాయం రూ. 16,62,959/- లు





**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 25**

జిల్లాలో ప్రసిద్ధి చెందిన ప్రముఖ పుణ్యక్షేత్రాలలో ఒకటిగా ప్రసిద్ధి చెందిన మిట్టపాలెం దేవస్థానములో భక్తులు సమర్పించిన హుండీలలోని కానుకలను మంగళవారం దేవస్థాన ఆవరణలో కందుకూరు డివిజన్ ఇన్స్పెక్టర్ జి.ఏ. సత్యనారాయణ పర్యవేక్షణలో దేవస్థాన కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ సమక్షంలో లెక్కింపు నిర్వహించారు ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు మాట్లాడుతూ రెండు నెలల రెండు రోజులకు సంబంధించి మెయిన్ హుండీల ద్వారా రూ.15,28,545/- లు, అన్నదానం హుండీల ద్వారా రూ.1,34,414/- లు వచ్చినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో రిటైర్డ్ బ్యాంకు ఎంప్లాయిస్, దేవస్థాన మాజీ కమిటీ సభ్యులు పాలపర్తి నారాయణరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు

# శ్రీ సంస్కృతి స్కూల్లో ఘనంగా ఓనం పండుగ వేడుకలు

**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 25**

గుర్రంవారిపాలెం లో ఉన్న శ్రీ సంస్కృతి స్కూల్లో ఓనం పండుగను విద్యార్థులు, ఉపాధ్యాయులు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణాన్ని తరగతి గదులను పూల ముగ్గులు మరియు తోరణాలతో అలంకరించారు. ఈ వేడుకల్లో విద్యార్థులు ఉపాధ్యాయులు కేరళ సాంప్రదాయ దుస్తులు ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ పండగను నిర్వహించడానికి గల ముఖ్య ఉద్దేశాన్ని చైర్మన్ కొంకా చంద్రశేఖర్ వివరించారు. దేశాభివృద్ధి అంటే వివిధ రంగాలలో పురోగతి చెందడమే కాదు మన సంస్కృతిని మనం కాపాడుకోవడంలో కూడా ఉంటుందని , మన సంస్కృతిని భావితరాల వారికి అందించాలనే ముఖ్య ఉద్దేశంతో శ్రీ సంస్కృతి స్కూల్లో ప్రతి పండగను మతం, రాష్ట్రము, కులంతో సంబంధం లేకుండా అత్యంత ఉత్సాహంగా ఘనంగా నిర్వహించి ఆ పండగల యొక్క ముఖ్య ఉద్దేశాన్ని విద్యార్థులందరికీ తెలియజేయడమే అన్నారు. ఓనం అనేది కేరళలో నిర్వహించే అతి ముఖ్యమైన పండగ అని, ఈ పండుగ భిన్నత్వంలో ఏకత్వాన్ని




చాటిచెబుతాయి అన్నారు. విద్యార్థులకు ఇతర రాష్ట్రాల సంస్కృతులపై అవగాహన కల్పించేందుకు ఈ వేడుకలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ వేడుకలలో భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఓనం పండుగ యొక్క ప్రాముఖ్యతను తెలియజేయడానికి డ్రామాలు మరియు నృత్యాలు




చేశారు. ఈ కార్యక్రమం చైర్మన్ కొంకా చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. దీనికి ప్రిన్సిపల్ హరి, వైస్ ప్రిన్సిపల్ శోభారాణి , ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఓగూరులో దేవస్థానం భూమిలో అక్రమ చర్చి నిర్మాణం నిలుపుదల చేయాలి

-అధికారుల దృష్టికి ఫిర్యాదు చేసినా స్పందన శూన్యం

-నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని విశ్వహిందూ పరిషత్ డిమాండ్



**కందుకూరు, పెన్ పవర్ ఆగస్టు 25**

మండలంలోని ఓగూరు గ్రామంలోని చారిత్రాత్మక శ్రీ వరదరాజ స్వామి దేవస్థానం ఎదురుగా దేవస్థానానికి సంబంధించిన భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా చర్చి నిర్మాణం చేపడుతున్నారని ఈ అక్రమ నిర్మాణం నిలుపుదల చేయాలని గ్రామస్తుల అధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితం శూన్యమని విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు ఉప్పుటూరి కొండప నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై దేవాదాయశాఖ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, జిల్లా కలెక్టర్‌తో పాటు పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీవోలకు అర్జీలు, ఫిర్యాదులు అందజేసినట్లు వారు తెలిపారు. అయితే ఇప్పటివరకు సంబంధిత అధికారులు స్పందించిన దాఖలాలు లేవని గ్రామస్తులు పేర్కొన్నారు.

**నిబంధనలు పాటించాలి**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం దేవాలయాల పరిసరాల్లో మతపరమైన కార్యక్రమాలు, నిర్మాణాలకు సంబంధించి నిర్దేశిత నిబంధనలు పాటించాల్సి ఉంటుందని విశ్వహిందూ పరిషత్ నాయకులు పేర్కొన్నారు. ఇతర మతాలకు సంబంధించిన నిర్మాణాలు చేపట్టే సందర్భంలో సంబంధిత భూ హద్దుదారుల నిరభ్యంతర పత్రాలు, పంచాయతీ తీర్మానం తదితర అనుమతులు పొందడంతో పాటు జిల్లా అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఈ నిబంధనలను పాటించకుండా నిర్మిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న చర్చి నిర్మాణంపై అధికారులు వెంటనే విచారణ చేపట్టి, అనుమతులు ఉన్నాయా లేదా పరిశీలించాలని విశ్వహిందూ పరిషత్ డిమాండ్ చేసింది. అక్రమ నిర్మాణమని తేలితే వెంటనే పనులను నిలిపివేయాలని కోరింది.

**శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలి**

ఇలాంటి వివాదాస్పద నిర్మాణాలపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే భవిష్యత్తులో గ్రామంలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని విశ్వహిందూ పరిషత్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.అధికారులు స్పందించని పక్షంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధమవుతామని ప్రకాశం జిల్లా విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పుటూరి కొండపనాయుడు తెలిపారు. ఈ తరహా విషయాల్లో హిందువులు జాగృతంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

# రైతులు ఆరుతడి పంటలే వేయాలి

మండల వ్యవసాయాధికారి విజయ భాస్కర్ రెడ్డి






**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 25**

గిద్దలూరు మండలం లో బ్రాహ్మణ పల్లి, తాళ్లపల్లి గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి విజయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో "పొలం పిలుస్తోంది" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్లో వేసినటువంటి ప్రతి పంట కూడా గ్రామస్థాయిలో గ్రామ వ్యవసాయ నాయకులు ఈ పంటనమోదు కార్యక్రమం చేస్తున్నారు కావున పంటలు వేసిన ప్రతి రైతు కూడా గ్రామ వ్యవసాయ స్థాయికి సంప్రదించి ఈ- పంట నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ- పంట నమోదు చేసుకున్నప్పుడు మాత్రమే పంటలు నష్టపోయినప్పుడు ప్రభుత్వం ప్రకటించే పంట నష్టపరిహారము, పంటల బీమా వర్తిస్తుందని తెలిపారు. ఈ సంవత్సరం ఎల్నినో ప్రభావం వలన వర్షాలు చాలా తక్కువగా ఉంటాయని, రైతులు ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలని, నీరు ఎక్కువ అవసరమయ్యే పంటలకు వేయవలదన్నారు. ప్రస్తుతం పత్తి పంటలో పూత/గూడు ఎక్కువగా రాలుతుంది. ముఖ్యంగా వాతావరణం లో ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటం వలన, తామరపురుగు ఉధృతి ఎక్కువగా ఉండటం వలన పూత ఎక్కువగా రాలుతుందని నివారణ కు ఎకరాకి 1.5 కేజీ ఎన్:పి :కె 13:0:45/19:19:19,300-400 గ్రాములు బోరాన్,200 గ్రాములు పిప్రోనిల్ 40 ం ఇమిడాక్లోప్రిడ్ 40 డబ్ల్యూ జి పిచికారీ చేసుకున్న యెడల సమర్థవంతంగా అరికట్టవచ్చన్నారు. గ్రామ సభ అనంతరం గ్రామంలోని పత్తి, ఆముదం, కంది పంటల క్షేత్ర స్థాయిలో పరిశీలన చేశారు ఆ పంటలలో వచ్చు చీడ పీడలు , వాటి నివారణ చర్యలు రైతుల కు తెలిపారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి శ్రీనివాస రెడ్డి,గ్రామ వ్యవసాయ సహాయకులు గోవింద్ భాష, మస్తాన్ వలి, రైతులు పాల్గొన్నారు.

# మరణించిన సహోద్యోగి కుటుంబానికి తోటి బ్యాచ్ పోలీసులు అండ

- అభినందించిన జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు

**మునిసిపల్ కార్పొరేషన్ ఒంగోలు,పెన్ పవర్ ఆగస్టు 25**

ప్రకాశం జిల్లా పోలీస్ శాఖలో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ,2026 జూలై 12న ఉదయం ఒంగోలు టౌన్‌లోని పద్మ టవర్స్ ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఏ.ఆర్. కానిస్టేబుల్ మరియదాసు కుటుంబ సభ్యులకు 2013 బ్యాచ్‌కు చెందిన ఎ.ఆర్ పోలీస్ సిబ్బంది తమ వంతు సహాయంగా సేకరించిన మొత్తం రూ.2,02,000/- నగదును మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ వి.హర్ష వర్ధన్ రాజు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వారి కుటుంబ సభ్యుల యోగక్షేమాలను, పిల్లల చదువుల గురించి అడిగి తెలుసుకున్నారు. వారికి ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని ప్రయోజనాలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. పోలీస్ శాఖ వారికి అండగా ఉంటుందని, ఏదైనా సమస్య ఉన్న నేరుగా తనను కలవవచ్చని ఎస్పీ గారు తెలిపారు. పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన పోలీసు సిబ్బంది కుటుంబాల సంక్షేమానికి అన్ని విధాలా చర్యలు తీసుకుంటూ, వారికి అండగా ఉంటామని ఎస్పీ గారు అన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తమ సహోద్యోగి




కుటుంబానికి 2013 బ్యాచ్‌కు చెందిన తోటి బ్యాచ్ పోలీసులు తమ వంతు సహాయంగా ఆర్థిక సహాయం అందించి అండగా నిలవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సీతారామిరెడ్డి, 2013 బ్యాచ్‌కు చెందిన తోటి పోలీసులు రామకృష్ణ, హరిప్రసాద్, వెంకట నాయుడు, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి సంఘాలను బలోపేతం చేయాలి

జిల్లా ఇన్చార్జ్ జలదంకి నరసింహారావు మాదిగ



**సి.ఎస్.పురం, పెన్ పవర్ ఆగస్టు 25**

ఎమ్మార్పీఎస్, యంఎస్పి అనుబంధ సంఘాలను మండలస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మార్కాపురం జిల్లా ఇన్చార్జి జలదంకి నరసింహారావు మాదిగ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సి.ఎస్.పురంలో నిర్వహించిన మండల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీన జరగనున్న మాదిగల మహాసభను విజయవంతం చేసేందుకు సమన్వయంతో పనిచేయాలని కోరారు. భవిష్యత్తులో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో యువతను ఉద్యమంలో భాగస్వాములను చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో యువత పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు.ఎస్సీ వర్గీకరణ సాధించుకున్న నేపథ్యంలో మాదిగ ఉపకులాల ప్రజలు విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రిజర్వేషన్లను సద్వినియోగం చేసుకుని విద్య, ఉద్యోగ రంగాల్లో అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి సంఘాలను బలోపేతం చేస్తూ సామాజిక చైతన్యాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్చార్జి బలభద్ర శ్రీను మాదిగ, ఎంఎస్పి మండల ఇన్చార్జి నేదురపల్లి బెంజిమాన్ మాదిగ, బిటిఎఫ్ నాయకులు లక్కీపోగు అంటోని, బలబద్ర రవి, కాలువ భాస్కర్, బలభద్ర ప్రవీణ్, బీసీ నాయకులు బత్తుల ప్రసాద్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రీస్కూల్స్‌లో టీఎల్ఎంతో భోజనం చేయాలి - సిడిపిఓ సుధా

జ్ఞానజ్యోతి కార్యక్రమం చివరి రోజు విజయవంతం

ప్రీ స్కూల్ లో పిల్లలకు అర్థమయ్యే విధంగా బోధన చేయాలి

జ్ఞానజ్యోతి కార్యక్రమాలు అన్ని అంగన్వాడి కేంద్రాలలో అమలు చేయాలి






**సంతమాగులూరు, పెన్ పవర్, ఆగస్టు 25**

సంతమాగులూరు మండల కేంద్రంలో జ్ఞాన జ్యోతి ట్రైనింగ్ కార్యక్రమం సిడిపిఓ సుధా అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా గత ఐదు రోజులుగా జరిగిన శిక్షణ తరగతులను టీచర్స్ చేత డెమోన్‌స్ట్రేషన్ ఇవ్వడం జరిగింది. టీచర్స్ అందరూ చక్కగా ఈ శిక్షణలో ఏమి నేర్చుకున్నారు, ప్రతి ఒక్క అంగన్వాడి టీచర్ ప్రీస్కూల్ విద్యా విధానంలో ఎలా చెప్తే పిల్లలకి అర్థం అవుతుందో టీఎల్ఎం ఉపయోగించి పిల్లలకు బోధిస్తే చక్కగా అర్థం చేసుకుంటారని తెలియజేశారు. అలాగే సమ్మిళత విద్య గురించి అలాగే వైకల్యాల్లో రకాల గురించి వివరించారు. ఆదర్శశిల,నవచేతన గురించి చాలా అర్థవంతంగా అందరికీ అర్థమయ్యేలా తెలియజేశారు. ఇవన్నీ రేపటినుండి మా అంగన్వాడి కేంద్రాలలో జరిగే కార్యక్రమాల్లో అమలు చేస్తామని అంగన్వాడి టీచర్లు అందరూ చెప్పారు. అలాగే ప్రీస్కూల్ పాటల గురించి అందరూ గ్రూపుగా వచ్చి చక్కగా పాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ జి టి టీచర్స్ డి.వి కోటేశ్వరరావు, ఏవి నాగ సుబ్బారావు, పి వీరాంజనేయులు, అంగన్వాడి సూపర్వైజర్స్ జి ప్రమీల, ఎం సుష్మారాణి, మండలంలోని అంగన్వాడీ టీచర్స్ అందరూ పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాలు కోలాహలంగా జరగటం తమకెంతో ఆనందంగా ఉందని మండలంలోని అంగన్వాడీ టీచర్లందరూ తెలిపారు.

# 27 నుండి శ్రీగిరి పవిత్రోత్సవాలు - శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి వెల్లడి

**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు ఆగస్టు 25**

ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠపాలిత శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి పవిత్రోత్సవాలను ఆగస్టు 27 నుండి 29 వ తేదీ వరకు శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి.. ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మ కర్త సి వి రామకృష్ణారావు, శ్రీ గిరి దేవస్థానం ఉత్తర అమెరికా ప్రతినిధి డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ రాజీవ్,. ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మి కుమారి వెల్లడించారు. తిరుమల తిరుపతి దేవస్థానం వేద పండితులు పరాంకుశం సీతారామాచార్యులు బృందం ఆధ్వర్యంలో వైఖానస ఆగమ సంప్రదాయం ప్రకారంగా పవిత్రోత్సవాలు జరుగుతాయని తెలిపారు. పవిత్రోత్సవాలలో భాగంగా ఈ నెల 27వ తేదీ గురువారం ఉదయం శ్రీవారికి సహస్ర నామార్చన, పంచాంగ పఠనం జరుగుతాయి. సాయంత్రం 6 గంటలకు విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, మేదినీ పూజ, మృత్సంగ్రహణం, అంకురార్పణ, చతుర్వేద పారాయణ, పంచ గవ్యారాధన, అకల్మష హోమం, రక్షాబంధనం, పంచగవ్యాధివాసం,





క్షీరాధివాసం, జలాధివాసం, శయనాధివాసం కార్యక్రమాలను నిర్వహిస్తారు. 28వ తేదీ శుక్రవారం ఉదయం 6 గంటలకు శ్రీవారికి శుక్రవారం అభిషేకం, 8 గంటలనుండి కుంభారాధన, నిత్య హోమం, 9 గంటలకు శ్రీవారికి విశేష స్నపన తిరుమంజనం, పవిత్రాల సమర్పణ, సాయంత్రం 6.30 లకు పంచసూక్త హోమం, పారమాత్మిక హోమం, అష్టాశీతి హోమం , రాత్రి 9 గంటలకు శ్రీవారి ఏకాంత సేవ కార్యక్రమాలు జరుగుతాయి. 29వ తేదీ శనివారం ఉదయం శ్రీవారికి సహస్ర నామార్చన, విష్వక్సేన ఆరాధన, కుంభారాధన, సుదర్శనారాధన, సర్వ దైవత్య హోమం, సహస్రశీతి మంత్ర హోమం, 10 గంటలకు శ్రీవారికి విశేష స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. సాయంత్రం కుంభ నివేదనం, సర్వ దైవత్య హోమం, ప్రాయశ్చిత్త హోమం, ఉక్త హోమం , పూర్ణాహుతి , రక్షాబంధన విసర్జన , ఆచార్య శేష వస్త్ర బహుమానం, బ్రహ్మ ఘోష, యజమాన ఆశీర్వచనం కార్యక్రమాలతో మూడు రోజుల పవిత్రోత్సవాలు ముగుస్తాయి. శ్రీవారి పవిత్రోత్సవాలలో పాల్గొన దలచిన భక్తులు శ్రీగిరి దేవస్థానం కార్యాలయంలో సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు కోరారు.

## సెప్టెంబర్ 12 న జాతీయ లోక్ అదాలత్

**- అధిక సంఖ్యలో కేసుల పరిష్కారానికి న్యాయవాదుల సహకారం అవసరం**

**- సీనియర్ సివిల్ జడ్జి సిహెచ్ వి. రామకృష్ణ**





**మునిసిపల్ కార్పొరేషన్ ఒంగోలు,పెన్ పవర్ ఆగస్టు 25**

సెప్టెంబర్ 12వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులను పరిష్కరించేందుకు న్యాయవాదులు తమ వంతు సహకారం అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తాత్కాలిక కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి సి. హెచ్.వి రామకృష్ణ అన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు మంగళవారం ఒంగోలు పట్టణంలోని జిల్లా న్యాయస్థానం ప్రాంగణంలో ఉన్న బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న న్యాయమూర్తి మాట్లాడుతూ, సెప్టెంబర్ 12వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయడానికి పెండింగ్‌లో ఉన్న రాజీ పడదగిన కేసులను గుర్తించి, ఇరుపక్షాల సమ్మతితో త్వరితగతిన పరిష్కరించేందుకు న్యాయవాదులు సహకరించాలని కోరారు. లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులకు సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు, స్నేహపూర్వక వాతావరణంలో వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. అదేవిధంగా, ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా సంబంధిత కక్షిదారులకు లోక్ అదాలత్ ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని న్యాయవాదులను కోరారు. జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం ద్వారా న్యాయస్థానాలపై పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించడంతో పాటు, ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు చావలి రమేష్ బాబు, మహిళా ప్రతినిధులు ఎం సుకన్య, ఆరిగ శ్రీలక్ష్మి తో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

## ఘనంగా టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు

**గుడ్లూరు, పెన్ పవర్, ఆగస్టు 25:**

జాతీయ స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని అడవిరాజుపాలెం హైస్కూలులో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని, ఆయన స్వాతంత్ర్య పోరాటం, ప్రజాసేవ, ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా ఆయన అందించిన సేవలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమాన్ని వర??ష హెల్ప్‌లైన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పి.మనోహరం నిర్వహించారు. జెడ్‌పీహెచ్‌ఎస్, అడవిరాజుపాలెం పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు వర??ష హెల్ప్‌లైన్ తరఫున పి.మనోహరం ఉపాధ్యాయులు పతకాలు అందజేశారు. విజేతలుగా 5వ తరగతి టి.చందు, 4వ తరగతి ఎ.మహాలక్ష్మి, 3వ తరగతి ఎ.నిహారిక, 2వ తరగతి జోషిత, 1వ తరగతి వై.చాణక్య నిలిచారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి.రాజా, పీఎస్‌హెచ్‌ఎం కె.వరలక్ష్మి, ఉపాధ్యాయులు పి.మనోహరం, ఆర్.రమణారావు, పి.మాల్యాద్రి, పి.మునుస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.



## స్వర్ణ గ్రామ సేవలను మరింత మెరుగుపరచాలి

**పెండింగ్ సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలి -డివిల్డిఓ కె శ్రీనివాసరెడ్డి**

**సి ఎస్ పురం, పెన్ పవర్ అగస్టు 25**

స్వర్ణ గ్రామ సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులకు సక్రమంగా హాజరై ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించి పెండింగ్ సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ కనిగిరి డివిజనల్ అభివృద్ధి అధికారి కె శ్రీనివాసరెడ్డి అన్నారు మండలంలోని చింతపూడి స్వర్ణ గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి సిబ్బంది పనితీరుపై ఆరాధించారు అనంతరం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి వివిధ అంశాలపై వివరాలు మరియు వాట్సప్ గవర్నర్స్ , యుఎఫ్ఎస్ మిస్సింగ్ డేటా, పెండింగ్ లో ఉన్న సర్వేలు రికార్డుల నిర్వహణపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు పెండింగ్ లో ఉన్న సర్వేలను పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు ప్రభుత్వ సేవలకు సంబంధించి విఆర్ఎస్ కాల్స్ పై ప్రజలకు అవగాహన కల్పించి 100 శాతం సానుకూల ప్రజాభిప్రాయం వచ్చేలా పనిచేయాలని సూచించారు కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు అపాయంగా పలకరిస్తూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ సేవలను మరింత మెరుగుపరచాలని సూచించారు తల్లికి వందనం పథకంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకోవాలని, అర్హత ఉన్నప్పటికీ అనర్హులుగా నమోదైన



లబ్దిదారులు గ్రీవెన్స్ ద్వారా అర్హత పొందేలా చూడాలని సూచించారు. పెండింగ్ లో ఉన్న ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలని, పంచాయతీరాజ్ శాఖ 45 రోజుల యాక్షన్ ప్లాన్ ను పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. ఇంటి పన్ను వసూళ్లు తక్కువగా ఉన్నందున ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన వసూలు చేయాలని, పెండింగ్ లో ఉన్న హరిత రాయబారుల గౌరవ వేతనాలను చెల్లించాలని సూచించారు. స్వర్ణ గ్రామ సిబ్బంది రిజిస్టర్లను తప్పనిసరిగా నిర్వహించాలని, పంచాయతీ అభివృద్ధి అధికారి జనన, మరణ రిజిస్టర్లతో పాటు పంచాయతీకి సంబంధించిన అన్ని రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బ్రహ్మానందరెడ్డి, స్వర్ణ గ్రామ సిబ్బంది, స్వర్ణ గ్రామ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి మండల్ సేవలు చిరస్మరణీయం -జాడి శ్వేత



**గిద్దలూరు,పెన్ పవర్ ఆగస్టు 25:**

వెనుకబడిన వర్గాల హక్కులు, సామాజిక న్యాయం కోసం విశేష కృషి చేసిన బిందేశ్వరి ప్రసాద్ మండల్ (బి.పి. మండల్) జయంతి వేడుకలను మంగళవారం గిద్దలూరులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బి.పి. మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. బీసీ నాయకులు, సంఘాల ప్రతినిధులు ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా కార్యదర్శి జాడి శ్వేత మాట్లాడుతూ, దేశంలోని సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల పరిస్థితులను అధ్యయనం చేసి వారికి సముచిత అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో మండల్ కమిషన్ చేసిన సిఫార్సులు భారతదేశంలో సామాజిక న్యాయ సాధనకు కీలక మలుపుగా నిలిచాయని పేర్కొన్నారు. “వెనుకబడిన వర్గాలకు విద్య, ఉద్యోగాలు, పాలనలో సమాన అవకాశాలు లభించాలనే లక్ష్యంతో బి.పి. మండల్ చేసిన కృషి చిరస్మరణీయం. బీసీల హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం ఆయన చూపిన మార్గం నేటి తరాలకు స్ఫూర్తిదాయకం” అన్నారు. మండల్ ఆశయాలను కొనసాగిస్తూ బీసీల విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం , సామాజిక అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని 139 కులాల రాష్ట్ర జనరల్ సెక్రటర్ ఓ.వెంకటయ్య యాదవ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు పట్టణ బి.సి.సంక్షేమ సంఘము అధ్యక్షుడు అద్దంకి. మధుసూధనరావు,వాల్మీకి సంఘము నాయకులు నల్లబోతుల వెంకటేశ్వర్లు, శాలివాహన సంఘము నాయకులు సుండి.వెంకటరమణ,రజక సంఘ అధ్యక్షుడు పాలకవీటి బాలచెన్నయ్య ,రజక సంఘ వైస్ ప్రెసిడెంట్.అలసందల.పాండు, ఇతర బి.సి.నాయకులు పాల్గొని బి.పి. మండల్‌కు నివాళులర్పించారు.

## వెలిగొండ ముంపు విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా

**769 మందికి ప్రత్యామ్నాయ విద్య**

**విద్యార్థులు కోరుకున్న**

**స్కూల్లోనే విద్య,హాస్టల్ సౌకర్యం**

**పూల సుబ్బయ్య వెలుగొండ**

**ప్రాజెక్ట్ కోసం త్యాగం చేసిన గ్రామాలు**

**పిల్లల చదువుకు ప్రత్యేక ప్రణాళిక**

**-డి.ఈ.ఓ ఎస్. సుబ్బారావు**



**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 25**

శ్రీ పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వం త్యాగం చేసిన ముంపు గ్రామాల నిర్వాసితుల పిల్లల భవిష్యత్తు పట్ల ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని డిఇఓ సుబ్బారావు తెలిపారు.మంగళవారం డిఇఓ కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ అధికారి సామ సుబ్బారావు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దార వీడు మండలంలోని కలనూతల,సుంకేసుల, గుండంచర్ల,మార్కాపురం మండలంలోని గొట్టిపడియ , అక్క చెరువు గ్రామాలలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 769 మంది విద్యార్థులను ఆయా మండలంలోని ఇతర గ్రామాల్లో ఉన్న ప్రాథమిక పాఠశాల,జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. సుంకేసుల గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 216 మంది, మండల ప్రజా పరిషత్ పాఠశాలలో 176 మంది, ఎస్సీ పాలెం లో ఉన్న పాఠశాలలో 105 మంది విద్యార్థులు చదువుతున్నారని చెప్పారు.ఇందులో జిల్లా పరిషత్తు లో చదువుతున్న 216 మంది విద్యార్థులను మార్కాపురం పట్టణంలో ఉన్న పూల సుబ్బయ్య కాలనీలో గల హైస్కూల్ లో, ఎంపీపీ స్కూల్ విద్యార్థులను తోకపల్లి గ్రామంలో చేర్చేందుకు అధికారులు ఏర్పాటు చేశారని అన్నారు. అలాగే కలనుతల, నాగులవరం గ్రామాలకు చెందిన 202 మంది విద్యార్థులను దరిమడుగు, దేవరాజు గట్టు గ్రామాలలోని స్కూళ్లకు తరలించనున్నారని పేర్కొన్నారు. గొట్టిపడియ, అక్క చెరువు గ్రామాలకు చెందిన 66 మంది విద్యార్థులను సమీపంలోని జమ్మనపల్లి, కొలబిమునిపాడు,కొత్తపల్లి గ్రామాలలోని స్కూళ్లకు తరలించినట్లు చెప్పారు. గుండంచర్ల గ్రామానికి చెందిన 66 మంది విద్యార్థులను పెద్దారావీడు మండలం గొబ్బూరు గ్రామానికి చెందిన పాఠశాలకు పంపుతున్నట్లు తెలిపారు.ముంపు గ్రామాల నిర్వాసితుల పిల్లల భవిష్యత్తు పట్ల ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని అన్నారు. వెలిగొండ ప్రాజెక్టులోకి సాగర్ జలాలు రానున్న నేపథ్యంలో పెద్దారవీడు, మార్కాపురం మండలాల లోని ఐదు గ్రామాల ప్రజలు అక్కడ నుండి తరలి వెళ్లనున్నారని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా సంవత్సరానికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సాఫీగా సాగేందుకు కలెక్టర్ విజయ సునీత ఆదేశాలతో తమ శాఖ ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతుందని ఆయన అన్నారు.ఆయా గ్రామాలను వీడనున్న నిర్వాసితుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు వారి విద్యాభివృద్ధికి సంబంధించి నాలుగు రకాల ఆప్షన్లు ఇవ్వడం జరిగిందని అన్నారు. విద్యార్థులకు వారు కోరుకున్న ప్రాంతాల్లో, హైస్కూల్ , ప్రభుత్వ వసతి గృహాల్లో కూడా సౌకర్యం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా విద్యా శాఖ అధికారి సామ సుబ్బారావు అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో డిప్యూటీ డిఇఓ పి శ్రీనివాసులు, ఎంఈఓ లు రామదాసు నాయక్, టి శర్వాణి తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాలకు నోటీసులు జారీ చేసిన అధికారులు

**11.67 లక్షల ఎరువుల విక్రయాలు నిలుపుదల**





**గుడ్లూరు, పెన్ పవర్, ఆగస్టు 25**

విక్రయాలు సరిగా నిర్వహించని ఎరువుల దుకాణాలకు వ్యవసాయ అధికారులు నోటీసులు జారీ చేశారు. గుడ్లూరు మండలం నందలి ఎరువుల షాపులను మంగళవారం వ్యవసాయ అధికారులు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలలో సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.కె అబ్దుల్ రహీం, మరియు స్థానిక మండల వ్యవసాయ అధికారి బి.రవి కుమార్ పాల్గొని ఎరువుల దుకానాలలోని బిల్లులు, రిజిస్టర్లు, స్టాకు మరియు ధరల బోర్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీలలో కొనుగోలు బిల్లులు సరిగా ఇవ్వని మరియు స్టాకు, స్టాకు రిజిస్టర్లు సక్రమముగా నిర్వహించని హిమబిందు ఫెర్టిలైజర్స్, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర ఫెర్టిలైజర్స్ యాజమాన్యానికి నోటీసు జారీ చేస్తూ, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న రూ:11,67,222/- ల విలువ కలిగిన 77.815 మెట్రిక్ టన్నుల ఎరువులను విక్రయ నిలుపుదల చేయడం జరిగినదని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిమీద చట్ట పరమైన చర్యలు తీసుకోబడునన్నారు. అతిక్రమాన్ని బట్టి లైసెన్స్ రద్దు చేయబడునని వ్యవసాయ అధికారులు దుకాణదారులకు హెచ్చరికను జారీచేశారు. ఎరువుల దుకాణాలలో రైతులు విక్రయాలు జరిపినప్పుడు తప్పని బిల్లులను అడిగి తీసుకోవాలని అధికారులు ఈ సందర్భంగా తెలియజేశారు.

## ఈవీఎం గోదాముల తనిఖీ



**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 25**

నెలవారీ తనిఖీలలో భాగంగా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు మంగళవారం ఒంగోలు భాగ్యనగర్ లోని ఈవీఎం గోదాములను తనిఖీ చేశారు. గోదాముల తలుపులకు వేసిన సీల్ పరిశీలించారు. ఈ ప్రాంగణంలో కల్పించిన భద్రత, నిర్వహణకు సంబంధించిన రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట డిఆర్ఓ పి.వెంకటరమణ, జిల్లా ఎన్నికల విభాగ అధికారి శ్రీనివాసరావు ఉన్నారు.

## బల్లికురవ కళాశాల మైదానానికి ఆకతాయిలు నిప్పు



**సంతమాగులూరు, (బల్లికురవ) పెన్ పవర్, ఆగస్టు 25**

స్థానిక జూనియర్ కళాశాల మైదానానికి ఆకతాయిలు నిప్పు పెట్టారు. మంగళవారం 10 గంటల ప్రాంతంలో పక్కనే ఉన్న మద్యం దుకాణం నుండి చెట్ల పొదలలోకి చేరిన మందుబాబులు మద్యం సేవిస్తూ నిప్పంటించినట్లు తెలిసింది. ఈ సమయంలో గాలి కూడా వీస్తుండటంతో కళాశాల మైదానం లోకి మంటలు వ్యాపించాయి. మంటలు మరింతగా వ్యాపించకుండా సమీపంలోని దుకాణదారులు మంటలను అదుపు చేశారు. లేకపోతే పక్కనే ఉన్న సుబాబుల్ తోటలకు వ్యాపించేవి.మైదానంలోని వృక్షాలు, పచ్చిక అగ్నికి ఆహుతి అయింది.

## పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు కీలక సూచనలు

**వలేటివారిపాలెం, పెన్ పవర్ ఆగస్టు 25**

మండల పరిధిలోని అంకభూపాలపురం రైతు సేవా కేంద్రం వద్ద మంగళవారం ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమాన్ని మండల వ్యవసాయ శాఖాధికారి కె.వి. శేషారెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సజ్జ పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పంట యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణపై రైతులకు సూచనలు అందించారు. అనంతరం మాట్లాడుతూ... రైతులు తమ ధాన్యం, కందులు, మినుములు, శనగలు వంటి ఏ పంట ఉత్పత్తులనైనా పౌరసరఫరాల సంస్థ, మార్క్‌ఫెడ్ వంటి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు విక్రయించాలంటే ప్రతి రైతుకు ఫార్మర్ ఐడీ తప్పనిసరి అని స్పష్టం చేశారు. రైతులందరూ వ్యవసాయ శాఖ మార్గదర్శకాల ప్రకారం తమ వివరాలను నమోదు చేసుకుని ఫార్మర్ ఐడీ పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాయిమోహన్ కృష్ణ, రైతు సేవా కేంద్రం సిబ్బంది బాలకృష్ణ, హరికృష్ణ మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.



## ఈ నెల 27 తేదీన దోర్నాలలో చెకుముకి సైన్స్ సంబరాలు



**పెద్దదోర్నాల పెన్ పవర్ ఆగస్టు 25**

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో దోర్నాల పట్టణంలో పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల పరీక్ష ఈనెల 27వ తేదీన గురువారం నాడు వివిధ పాఠశాలల్లోని 8,9,10 తరగతుల విద్యార్థులకు నిర్వహించనున్నారు. ఈ సైన్స్ సంబరాల కరపత్రాన్ని స్థానిక భ్రమరాంబ మల్లికార్జున డిగ్రీ కళాశాలలో ఆ కళాశాల చైర్మన్ బట్టు రమణారెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వేమన ఇంటర్నేషనల్ స్కూల్ సీఈవో బట్టు రిత్విక్ రెడ్డి, జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి ఏనుగుల రవికుమార్, బిఎం డిగ్రీ కళాశాల అధ్యాపకులు పి పవన్ కుమార్ రెడ్డి, పి బెంజిమెన్, దారపునేని మధు, రవి నాయక్, షేక్ మహమ్మద్ భాష, జి ముక్తేశ్వరరావు, హనూక్, నారాయణ, పెద్దిరాజు, కాశిరాం, స్రవంతి, అనుష, రిజ్వాన, రవణమ్మ, గౌతమీ, ప్రసన్న, కావ్య తదితరులు పాల్గొన్నారు.

## ఫసల్ బీమా యోజన ను సద్వినియోగం చేసుకోవాలి

**పొలం పిలుస్తుంది కార్యక్రమంలో వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు**



**సంతమాగులూరు, (బల్లికురవ) పెన్ పవర్, ఆగస్టు 25**

ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే, పంటల నష్టాల నుంచి ఆర్థిక రక్షణ పొందేందుకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం మండలంలోని ఉప్పు మాగులూరు, సోమవరప్పాడు గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తగా పంటల బీమా, నమోదు చేయించుకోవాలన్నారు. ఈనెల 31 లోపు తమ పేర్లు నమోదు చేసుకొని ఈ పథకం ద్వారా రైతులు లబ్ధి పొందాలని సూచించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో పూర్తి వివరాలను తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ ఓ మౌలాలి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చల్లగుండ్ల కల్పన , వి ఏ ఏ ఆదర్స్, రామకృష్ణ, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## మానవత్వం లోకానికి పరిచయం చేసిన మహమ్మద్ ప్రవక్త



**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 25**

శాంతి,సహనం, సమానత్వం, మానవత్వంను లోకానికి పరిచయం చేసిన మహనీయులు మహమ్మద్ ప్రవక్త అని వైసీపీ మైనార్టీ అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ మోహిద్దీన్ తెలిపారు . మిలాద్ ఉన్ నబీ ఉత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రంలోని ముస్లింలకు సయ్యద్ గౌస్ మోహిద్దీన్ శుభాకాంక్షలు తెలియజేశారు. శాంతి సమానత్వం మానవత్వం కాపాడి దిశగా మనమంతా మహమ్మద్ ప్రవక్త అడుగుజాడల్లో పయనించి వారి యొక్క గొప్ప సందేశాన్ని నేటికీ ఎన్నటికీ సజీవంగా ఉంచాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన పేర్కొన్నారు. అన్యాయం పై ప్రశ్నించడం, న్యాయం దిశగా పోరాటం, అన్ని వర్గాల వారిని ఒకే విధంగా మానవనియ కోణంలో చూడటం వంటి అంశాలను మహమ్మద్ ప్రవక్త ఆచరించి ఈ ప్రపంచానికి గొప్ప సందేశం పంపించాలని వెల్లడించారు.

## వైయస్ జగన్ ను కలిసిన దద్దాల

**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 25**

తాడేపల్లి వైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం పార్టీ అధినేత,మాజీ సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి ని కనిగిరి నియోజకవర్గం వైయస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ మర్యాద పూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక అంశాలు జగన్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వం హామీల మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం,పార్టీ బలోపేతం, స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధత, అభ్యర్థుల ఎంపిక, గ్రామ స్థాయి నుండి నియోజకవర్గ స్థాయి వరకూ స్థానిక సంస్థల ఎన్నికల ప్రణాళికలు,ప్రతి ఇంటా ప్రచార కార్యక్రమం ,వైయస్సార్‌సీపీ ప్రభుత్వ సంక్షేమ పాలనపై ప్రచారం,తాజా రాజకీయ పరిణామాలు,ఎస్ఐఆర్ ప్రక్రియ తదితర కీలక అంశాలపై దిశానిర్దేశం చేసినట్లు దద్దాల వెల్లడించారు.త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి కార్యకర్తకు, పార్టీ నాయకులకు అండగా నిలబడాలని, కూటమి కుతంత్రాలను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని, నీకు అన్ని విధాలుగా అండగా నిలబడతానని భరోసా ఇచ్చినట్లు దద్దాల నారాయణ యాదవ్ తెలిపారు.



# పదిలమైన జ్ఞాపకాలతో పరాయి ఊరికి

### వెలుగొండ ప్రాజెక్టు కోసం గ్రామాలను వదిలి వెళుతున్న నిర్వాసితులు

### స్వంత ఇండ్లను, పొలాలను వదిలి మూటముల్ల సర్దుకుని గుండె బరువుతో శాశ్వత వీడ్కోలు

**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ ఆగష్టు 25**

ఆ ఊరిలోనే పుట్టి పెరిగి, కాయ కష్టంతో స్వంత ఇండ్లను నిర్మించుకుని,భూమి తల్లిని నమ్ముకుని పండించిన పంటలను కుటుంబాలను పోషించుకున్న వెలుగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాల నిర్వాసితులు శోకతప్త హృదయాలలో, పదిలమైన జ్ఞాపకాలతో స్వంత తల్లి లాంటి ఊరికి శాశ్వత వీడ్కోలు పలికి పరాయి ఊరికి తరలి వెళుతున్నారు.చిన్ననాటి జ్ఞాపకాలు, పండుగలు, పెళ్లిళ్లు, చెమట చుక్కలతో సాగు చేసుకున్న పొలాలను, అమ్మమ్మ తాతయ్య చేతి కర్రను పట్టి నడక నేర్చి, తాత, నాన్నల బుజాలమీద గుడులకు, బడులకు వెళ్లిన తీపి గురుతులను అక్కడే వదిలేసి ఊరి పొలిమేరలు దాటిపోతున్న దృశ్యాలు ఎవరికైనా కంట నీరు పెట్టించక తప్పదు.ఇండ్లను ఖాళీ చేసి సామాన్లను తీసుకెలుతున్నాం కాని ఏళ్ల తరబడిఉన్న ఇండ్లను, భూమితల్లిని తీసుకుపోలేం కదా అంటు కన్నీళ్ల పర్యంతం అవుతున్నారు.

**మా ఊరిని మళ్లి చూడలేం**

ఏళ్ల తరబడి మీ ఊరు ఏదంటే గొప్పగా, సుంకేసుల, గొట్టిపడియ, కలనూతలా అని చెప్పుకున్నోళ్ళం, ఇప్పుడు చెల్ల చెదురయ్యం,ఏ ఊరు మాదని చెప్పుకోవాలి, మా ఆధార్ కార్డులు, మా నేటివిటి సర్టిఫికెట్లు దీనికి పనికి రావని వాపోతున్నారు. వెలుగొండ ప్రాజెక్టు లక్ష్యం గొప్పదైనా, మా నిర్వసితులకు మౌలిక వసతుల కల్పన శూన్యమే అని యాడ తల దాచుకోవాలా, పిల్లలను ఎలా పోషించుకోవాలా, వారి చదువుల సంగతి ఏమిటి అని ప్రశ్నిస్తున్నారు.



**ఊరు వదిలి.. తలో దిక్కుకు**

బంధాలు బంధుత్వాలతో కలిమి లేమిలతో, అనురాగాలు, ఆప్యాయతలు పంచుకున్న వెలుగొండ నిర్వాసితుల కుటుంబాలు నేడు తలో దిక్కుగా చెల్ల చేదురైపోతున్నాయి. నిర్వాసితుల కేంద్రాలలో మౌలిక వసతులు లేకపోవడంతో కొందరు మార్కాపురం, దోర్నాల, పెద్దారవీడు, కుంట, ప్రాంతాలకు తరలివెళుతున్నారు.

**కొన్నాళ్ళకు ఊరు మాయం**

వెలుగొండ ప్రాజెక్ట్ నుండి ఈ నెల 31న నీరు వదులుతున్న నేపథ్యంలో



ముంపు గ్రామాల ఆనవాళ్ళు పూర్తిగా కనుమరుగయ్యే దుస్థితి. ముంపు గ్రామాలు కృష్ణమ్మా జలాలకౌగిలిలో బంది కాక తప్పదు. నిర్వాసితులు ఖాళీ చేసిన ఇండ్లు, పొలాలు బడులు, గుడులు నీటి అంతర్భాగంలో మాయం అయ్యే పరిస్థితి.

**నిర్వాసితుల కొత్త జీవితం**

ముంపు గ్రామాల నిర్వాసితుల కొత్త జీవితం, బ్రతుకు పోరాటం మళ్ళీ మొదలైనట్టే, ఇంటి అద్దెలు కట్టలేక, జీవన ఆధారంకోసం కూలి పనుల వెతుకులాట, కుటుంభ పోషణ, పిల్లల చదువులు ప్రశ్నర్ధాకమే.ఉమ్మడి ప్రకాశం జిల్లాలలోని 15లక్షల మందికి త్రాగునీరు,4.59లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్న వెలుగొండ ప్రాజెక్టు కోసం ఈ నిర్వాసితులు చేస్తున్నా త్యాగం చరిత్ర పుటల్లో నిలిచిపోతుంది.

# ఆడిటోరియం కార్పొరేట్లకు కట్టబెట్టొద్దు

**– సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య – కళాకారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలి**

**– పింఛన్, బస్, రైల్వే పాస్, నివేశిత స్థలాలు ఇవ్వాలి – జిల్లా కలెక్టరేట్ వద్ద ఏపీ ప్రజానాట్యమండలి నిరసన కార్యక్రమం**



**మునిసిపల్ కార్పొరేషన్ ఒంగోలు,పెన్ పవర్ ఆగస్టు 25**

ఒంగోలు మునిసిపల్ ఆడిటోరియంను కార్పొరేట్ శక్తులకు అప్పగించోద్దని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఏపీ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మార్పు రావాలి, మార్పు కావాలి అనే కార్యక్రమంలో భాగంగా కళాకారుల జీవన శైలి, కళా రంగానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి స్థానిక కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ రామకృష్ణ అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒంగోలులో గత 80 సంవత్సరాలు కాలంగా పాత రోటరీ క్లబ్ వారు దానం చేసిన మునిసిపల్ ఓపెన్ థియేటర్ లో గతంలో కళాకారులు, కళా ప్రదర్శన ఇచ్చేవారన్నారు. అయితే ప్రస్తుత పాలకులు దానిని కార్పొరేట్ శక్తులకు అప్పనంగా అప్పగించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ప్రజా కళాకారులకు, జానపద కళాకారులకు, పద్య కళాకారులకు, నాటక, సినీ రంగాలలో ఎంతో ఉత్తమమైన అత్యుత్తమ కళాకారులను అందించిన ప్రకాశం జిల్లా కేంద్రంలో కళాకారులు తమ ప్రదర్శన ఇచ్చేందుకు ఆడిటోరియం లేకపోవడం శోచనీయమన్నారు. గతంలో ఉన్న ఆడిటోరియం అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 750 కోట్ల నిధులు మంజూరు చేసినప్పటికీ, వాటిని సద్వినియోగం చేసుకోవడంలో జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు విఫలమయ్యారని ధ్వజమెత్తారు. ఇప్పుడు ఏకంగా ఆడిటోరియంనే కనుమరుగు చేసేందుకు ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. ఆడిటోరియం చుట్టూ ఉన్న స్థలాలలో షాపులు నిర్మించి వాటిని అద్దెకి ఇవ్వటం ద్వారా నెలకు దాదాపుగా రూ. ఏడు నుండి ఎనిమిది లక్షల వరకు అద్దె వసూలు అవుతుందని, అంతే కాకుండా ప్రదర్శన ద్వారా వచ్చే ఆదాయంతో మెయింటెనెన్స్ పోగా రాష్ట్ర ప్రభుత్వానికి బాగానే ఆదాయం వస్తుందన్నారు. అంతేకాకుండా ఆడియో స్టేడియం ద్వారా కళాకారులలో ఉత్సాహం పెరుగుతుందని, ప్రజలలో సృజనాత్మక పెంచేందుకు వారు వేసే కళారూపాలు ఎంతో దోహదం చేస్తాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రస్తుత ప్రజాప్రతినిధులు కళ్ళన్నీ ఖాళీ భూములు కబ్జా చేయటం, కుదరకపోతే కార్పొరేట్ శక్తులకు లీజుకు ఇవ్వటం పైనే దృష్టి ఉందన్నారు. అందుకే రిలయన్స్ కంపెనీకి దాదాపుగా రూ. 250 కోట్ల విలువచేసే ఆడిటోరియం భూమిని అప్పగించేందుకు సిద్ధమవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆడిటోరియం భూములను రిలయన్స్ కంపెనీకే కాదు, ఏ ప్రైవేట్ కంపెనీకి ఇచ్చిన సిపిఐ గా వ్యతిరేకిస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆ స్థలంలో ఒక సాంస్కృతిక ఆడిటోరియాన్ని నిర్మించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, రాజ్యసభ సభ్యులు, ఉన్న జిల్లాలో ఆడిటోరియం నిర్మించడం మీకు చేతకాకపోతే జోలె పట్టుకొని అయినా కళాకారులు ఆడిటోరియాన్ని నిర్మిస్తారని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ కూడా ప్రతి దానిని ఆదాయ వనరుగా చూడవద్దని హితవు పలికారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఆర్ వెంకట్రావు మాట్లాడుతూ కళలను డబ్బుతో పోల్చవద్దన్నారు. కళాకారులకు పుట్టినిల్లు అయిన ఒంగోలులో ప్రభుత్వం ఆధీనంలో ఒక ఆడిటోరియం ఉండటం ఎంతో మేలు అన్నారు. ఏపీ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ రామకృష్ణ మాట్లాడుతూ కళాకారులకు పింఛన్,బస్, రైల్వే పాస్ లతో పాటుగా, పేద కళాకారులకు నివేసిత స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి ముందుగా కలెక్టర్ కార్యాలయం వద్ద నుండి మునిసిపల్ ఓపెన్ ఆడిటోరియం వరకు కళాకారులు ర్యాలీగా వెళ్లి స్థలాన్ని పరిశీలించారు. అనంతరం బండారు రామారావు, చీమకుర్తి నాగేశ్వరరావు విగ్రహాల వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాకారుల అభ్యుదయ గీతాలు, పద్యాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏపీ ప్రజానాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షులు గద్దెల బాలకోటయ్య, టి అనంతలక్ష్మి, టంగుటూరి ప్రభాకర్, నల్లూరి మురళి తదితరులు పాల్గొన్నారు.

## అన్నా! నోరు అదుపులో పెట్టుకో!

## టిడిపి నాయకులు గునుపూడి భాస్కర్



**పొదిలి, పెన్ పవర్, ఆగస్టు 25**

మాజీ శాసనసభ్యులు, వైసీపీ నాయకులు అన్నా వెంకట రాంబాబు తన నోరును అదుపులో పెట్టుకోవాలని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి గునుపూడి భాస్కర్ చెప్పారు. మంగళవారం నాడు పొదిలిలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన భాస్కర్ వైసిపి నాయకులు అన్నా రాంబాబు పై నిప్పులు చెరిగారు. తాను 44 సంవత్సరాల నుండి తెలుగుదేశం పార్టీలోనే కొనసాగుతూ తన శక్తి వంచన లేకుండా సేవలందిస్తున్నానని భాస్కర్ చెప్పారు. తాను ఎటువంటి పార్టీలు మారలేదని, ఈ విషయాన్ని అన్నా రాంబాబు గమనించుకోవాలని భాస్కర్ చురక అంటించారు. నిజాయితీకి మారుపేరుగా తాను వ్యవహరిస్తున్నానే తప్ప, ఎటువంటి తప్పుడు పనులు చేయలేదని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. తన కులానికి చెందిన నాయకుడిగా రాంబాబు అంటే తనకు అభిమానమేనని భాస్కర్ అన్నారు. తనకు కులాలు, మతాలు కన్నా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని తెలుగుదేశం పార్టీ అంటేనే వల్ల మాలిన ప్రేమ అని భాస్కర్ స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో ఆర్యవైశ్యుల ఓట్లను తన శక్తి మేరకు తెలుగుదేశం పార్టీకి వేయించడం వాస్తవమేనని భాస్కర్ స్పష్టం చేశారు. కులాలు మతాలు కన్నా పార్టీ ఎంతో ముఖ్యమని భాస్కర్ కరాఖండితంగా చెప్పారు. పొదిలిలో ఒక ఆర్యవైశ్యునికి ఇబ్బంది జరిగితే, అందుకు స్పందించిన తాను ఆందోళన చేపట్టడం జరిగిందనే విషయాన్ని ఈ సందర్భంగా భాస్కర్ ఉద హరించారు. తమ కులానికి చెందిన నాయకుడిగా అన్నా రాంబాబు పట్ల తమకు ఎంతో అభిమానం ఉందని, ఆయన కూడా తన వ్యక్తిత్వాన్ని కించపరుచుకునే విధంగా మాట్లాడడం మంచి పద్ధతి కాదని భాస్కర్ హితువు పలికారు. ఈ కార్యక్రమంలో పొదిలి ఏఎంసి చైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంస, సీనియర్ తెలుగుదేశం నాయకులు, ఆవులూరి ఎల్లమంద, మీగడ ఓబుల్ రెడ్డి, వరికుంట్ల అనిల్ కుమార్, ముల్లా కుద్దూస్, కాటూరి శ్రీను, ఆర్యవైశ్య సంఘం నాయకులు బాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి లోకేష్ పర్యటనను విజయవంతం చేయాలి

**ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు - పర్యటన వివరాలను వెల్లడి**



**మునిసిపల్ కార్పొరేషన్ ఒంగోలు,పెన్ పవర్ ఆగస్టు 25**

ఈనెల 28వ తేదీ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఒంగోలు పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు కోరారు. ఉదయం 9 గంటలకు గుళ్ళాపల్లి గ్రోత్‌సెంటర్ వద్ద సంతనూతలపాడు ఎమ్మెల్యే బి.ఎన్. విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మంత్రి లోకేశ్ స్వాగతం పలుకుతారన్నారు. హర్షిణి కాలేజీ విద్యార్థినులతో ఇంటరాక్షన్ అనంతరం చదలవాడలో కంది రవిశంకర్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న రాడిసన్ ఫైవ్‌స్టార్ హోటల్ నిర్మాణానికి భూమిపూజ చేస్తారన్నారు. అనంతరం త్రోవగుంట వద్ద ఒంగోలు మునిసిపాలిటీ ఏర్పడి 150 సంవత్సరాల సందర్భంగా జిల్లా వెలుగుమూర్తుల విగ్రహాల ప్రాంగణం ప్రారంభం, పీవీఆర్ గ్రౌండ్స్ వద్ద డ్రింకింగ్ వాటర్ పైలాన్ , 1500 మంది స్కూలు విద్యార్థులకు సైకిళ్ళు పంపిణీ, అనంతరం ఆధునీకరించిన పీడీసీసీ బ్యాంక్ ను ప్రారంభిస్తారన్నారు. జిజిహెచ్‌కు మంజూరు అయిన దాదాపు 5 కోట్ల నిధులతో నిర్మించనున్న బిల్డింగ్‌కు భూమిపూజ, మినీస్టేడియంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమాల సమయాలు తెలియరావల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు బి.ఎన్. విజయ్‌కుమార్, ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, నగర పార్టీ అధ్యక్షుడు మదన్, మాలెంపాటి కృష్ణారావు పాల్గొన్నారు.

## కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలి

**కాంగ్రెస్ పార్టీ నేత బిఆర్ గౌస్**




**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు ఆగస్టు 25**

దేశవ్యాప్తంగా, ముఖ్యంగా ఢిల్లీలో తమ భవిష్యత్తు, విద్యా హక్కులు, పరీక్షల్లో అవకతవకలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళనలు చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేయడం, పెల్లెట్ గన్‌లను ఉపయోగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త బి.ఆర్. గౌస్ అన్నారు. ప్రకాశం జిల్లా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొప్పుల సాయి కృష్ణ అధ్యక్షతన స్థానిక ప్రకాశం భవనం కూడలిలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని నిరసన చేపట్టారు. జూలై 20న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల ఆందోళన సందర్భంగా అధిక బలప్రయోగం జరిగిందన్న ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ఆయన అన్నారు. ఒక విద్యార్థి పెల్లెట్ గాయాలతో బాధపడినట్లు ఫిర్యాదు చేయడంతో ఢిల్లీ పోలీసులు ఆగస్టు 21న ఎఫ్ఐఆర్ నమోదు చేసిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. విద్యార్థులపై పెల్లెట్లు ప్రయోగించేంత తీవ్రమైన పరిస్థితి ఎందుకు వచ్చింది? ఆదేశాలు ఎవరిచ్చారు? అనే ప్రశ్నలకు కేంద్ర ప్రభుత్వం, ముఖ్యంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని గౌస్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొప్పుల సాయి కృష్ణ, యువజన కాంగ్రెస్ నాయకులు షేక్ అబ్దుల్ సుభాన్, రాయపాటి గిద్యోన్, షేక్ కరీం భాష, కొప్పుల నంద కిషోర్, నల్లూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రవక్త మహమ్మద్ బోధనలు స్ఫూర్తిదాయకం

**ముస్లింలకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ 'మిలాద్ ఉన్ నబీ' శుభాకాంక్షలు.**

**అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) ఆగష్టు 25:**



ప్రవక్త మహమ్మద్ జన్మదినోత్సవం 'మిలాద్ ఉన్ నబీ' పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ముస్లిం సోదర, సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రవక్త మహమ్మద్ బోధించిన శాంతి, ప్రేమ, కరుణ, సోదరభావం, మానవతా విలువలు సమాజానికి ఎల్లప్పుడూ ఆదర్శప్రాయమని మంత్రి కొనియాడారు. ఆయన చూపిన సన్మార్గంలో ప్రతి ఒక్కరూ నడుస్తూ, సమాజంలో ఐక్యత, సామరస్యాన్ని పెంపొందించాలని ఆకాంక్షించారు. మతాలు, ప్రాంతాలు, వర్గాలకు అతీతంగా ప్రజలందరూ పరస్పర గౌరవంతో కలిసిమెలిసి జీవించాలని పిలుపునిచ్చారు. ఈ పవిత్ర పర్వదినం ప్రతి కుటుంబంలో ఆనందం, ఆరోగ్యం, శాంతి, సుఖసంతోషాలను నింపాలని మంత్రి కోరుకున్నారు. రాష్ట్ర ప్రజలందరికీ సకల శుభాలు జరగాలని గొట్టిపాటి రవికుమార్ ఆకాంక్షించారు.

# రుణాలు మంజూరుకు చర్యలు తీసుకోవాలి - జాయింట్ కలెక్టర్ (ఇంచార్జి) పి.వి.రమణ






**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 25**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలలో లబ్ధిదారులకు త్వరగా రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ( ఇంచార్జి ) పి.వి.రమణ బ్యాంకర్లకు సూచించారు. మంగళవారం ప్రకాశం భవనంలో ఆయన అధ్యక్షతన జిల్లాస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం జరిగింది. 2026 - 27 ఆర్థిక సంవత్సరంలో వివిధ రంగాలకు రుణాల మంజూరు విషయమై బ్యాంకులకు ఇచ్చిన లక్ష్యం, ఈ దిశగా రుణాల పంపిణీపై ఈ సమావేశంలో ప్రధానంగా సమీక్షించారు. ఈ ఏడాది మొత్తం రూ. 28,335 కోట్ల రుణాలు ఇవ్వాలనేది లక్ష్యం కాగా, మొదటి త్రైమాసికంలో రూ.8961 కోట్ల ( 31.63 శాతం )ను అర్హులకు ఇచ్చినట్లు ఎల్.డి.ఎం. రమేష్ వివరించారు. దీనిపై జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అర్హులకు రుణాల పంపిణీలో జాప్యం లేకుండా చూడాలన్నారు. అర్హత కలిగిన పశుపోషకులు, మత్స్యకారులు అందరికీ కూడా కిసాన్ క్రెడిట్ కార్డులను ఇవ్వాలని చెప్పారు. పీఎంఎఫ్ఎంఈ రుణాలను కూడా సత్వరం అందేలా చూడాలన్నారు. వివిధ పథకాల కింద లబ్ధిదారుల ఖాతాలలో ప్రభుత్వాలు జమ చేస్తున్న నిధులను రుణాల రికవరీ పేరుతో బ్యాంకులు ఎట్టి పరిస్థితుల్లోనూ తీసుకోకూడదని ఆయన స్పష్టం చేశారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పథకాలను అమలు చేస్తున్నాయని, బ్యాంకులు కూడా అదే స్ఫూర్తితో పని చేయాలని జాయింట్ కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో ఆర్బిఐ లీడ్ బ్యాంక్ ఆఫీసర్ ఎలమందరెడ్డి, నాబార్డ్ డిడిఎం రవికుమార్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, జిల్లా పశుసంవర్ధక అధికారి రవికుమార్, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు, డి.ఆర్.డి.ఏ, మెప్మా పీడీ నారాయణ, ఏపీఎంఐపి పిడి శ్రీనివాసులు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్ శ్రీనివాసరావు, జిల్లా హౌసింగ్ అధికారి శ్రీనివాస ప్రసాద్, రూడ్ సెట్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, విద్యుత్, ఉద్యానవన, చేనేత జౌళి శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన డిఎల్డిఓ కె. శ్రీనివాసరెడ్డి



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 25**

రానున్న స్థానిక సంస్థల ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల నేపథ్యంలో మంగళవారం కనిగిరి డివిజనల్ అభివృద్ధి అధికారి, మండల స్పెషల్ ఆఫీసర్ కె. శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో వి ప్రతాపరెడ్డి మండలంలోని కోవిలంపాడు, శీలంవారిపల్లి, ఆనికాళ్లపల్లి, నల్లమడుగుల గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లోని గదుల పరిస్థితి, విద్యుత్ సౌకర్యం, తాగునీరు, ఇతర మౌలిక వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నేడూ.. విద్యుత్ బిల్లులు చెల్లింపు

**- జిల్లా విద్యుత్ శాఖ ఎస్ ఈ కె వెంకటేశ్వర్లు**

**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు ఆగస్టు 25**



విద్యుత్ వినియోగదారుల కోసం రేపు సెలవు రోజు ఐయనకూడా విద్యుత్ బిల్లులు చెల్లిచండానికి వీలుగా జిల్లా లోని అన్ని విద్యుత్ బిల్లు కట్టించుకునే కౌంటర్లు ఓపెన్గా వుంటాయని ప్రకాశం జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ కట్టా వెంకటేశ్వర్లు ఒక పత్రిక ప్రకటనలో తెలియజేశారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. అలాగే విద్యుత్ బిల్లులు ఫోన్ పే, డిపార్ట్మెంట్ ఆప్ ద్వారా కూడా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు అని తెలిపారు.

# మాగుటూరు, మాగుటూరు తండా గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం

**అర్ధవీడు, పెన్ పవర్, ఆగస్టు 25**

మండలంలోని మాగుటూరు, మాగుటూరు తండా గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి ఎస్ మనోహర్ ఆధ్వర్యంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు ఈనెల 31 తేదీన వెలుగొండ జలాలను విడుదల కార్యక్రమం ఉన్నందున కలెక్టర్ ఆదేశాల ప్రకారం వెలిగొండ ప్రాజెక్టు వారోత్సవాల్లో భాగంగా గురువారం వ్యవసాయ మరియు అనుబంధ శాఖ అధికారులు పాల్గొనాలని తెలియజేయడం జరిగింది. వ్యవసాయ అధికారి మాట్లాడుతూ వెలుగొండ జలాలు 30 వసంతాల రైతుల చిరకాల కోరిక నెరవేరబోతుందని నీటితో పొలాలన్నీ సస్యశ్యామలమవుతాయని తెలిపారు. అలాగే గ్రౌండ్ వాటర్ పెరగడమే కాకుండా బోర్ వెల్స్ అన్ని రీచార్జ్ అయి మన ప్రాంతంలో పంటల సరళి మారుతుందని అందుకు తగినట్టు ప్రణాళికలు ఎప్పటికప్పుడు వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు తెలియజేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. ఆగష్టు 31 లోపు వరి పంట వేసిన రైతులు ప్రధానమంత్రి ఫసల్ భీమా నందు నమోదు చేసుకోవాలని, ఎల్ నినో ప్రభావం వల్ల పంటల దిగుబడి తగ్గే అవకాశం ఉన్నందున రైతులు తప్పకుండా ఫసల్ భీమా నందు నమోదు చేసుకోవాలని,పంట వేసిన ప్రతి రైతు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు




చేయించుకోవాలని, అప్పుడు మాత్రమే ఇన్సూరెన్స్ వర్తిస్తుందని తెలిపారు. ఎపిఎఫ్ ఆర్ నందు పొలం కలిగిన ప్రతి రైతు 11 అంకెల ఫార్మర్ ఐడి పొందాలని వ్యవసాయ శాఖ ద్వారా అమలవుతున్న ప్రతి పథకానికి ఫార్మర్ ఐడి తప్పనిసరి అని ఐడి కొరకు సంబంధిత రైతుసేవ కేంద్రం సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. అలాగే ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ ఆఫీసర్ శ్రీకాంత్, వివిధ ఉద్యానవన పథకాల గురించి వివరించి వాటిని సద్వినియోగపరచుకోవాల్సిందిగా తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు వెంకటేశ్వర్లు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# వరి బదులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలిలి

**ఎల్నినోని సమర్ధవంతంగా ఎదుర్కోవాలి ఏవో షేక్ సైదా**







**సంతమాగులూరు, పెన్ పవర్, ఆగస్టు 25**

సంతమాగులూరు మండలం కొప్పరం, సజ్జపురం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి షేక్ సైదా గారు మాట్లాడుతూ ఈ ఎల్నినో ప్రభావం ఎక్కువ ఉండటం వలన వరి పంట వేయకూడదని వరికి ప్రత్యామ్నాయంగా పెసర, కంది, మినుములు, సజ్జ, కొర్ర, వంటి పంటలు వేసుకోవాలని తెలిపారు. రైతుల మౌలిక సూచనల కొరకు రైతు సేవ కేంద్రాలలో వ్యవసాయ అసిస్టెంట్లు అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు. అలాగే ఈ క్రాఫ్ ఇన్సూరెన్స్ ఈనెల 30 వరకు ఉందని రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కౌలు రైతుల తప్పకుండా సి సి ఆర్ సి కార్డులు తీసుకోవాలని చెప్పారు. పీఎం కిసాన్ రైతులందరూ ఈ కేవైసీ చేయించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మరియు విఏఏఎస్ సునీత, మౌనిక, ఎఫ్ఎంటి షేక్ నాగూర్ వలి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మరియు రైతుల పాల్గొన్నారు.

# వెలిగొండకు కృతజ్ఞతగా భారీ ట్రాక్టర్ల ర్యాలీ

**మార్కెట్ యార్డ్ నుండి పోలేరమ్మ ఆలయం వరకు హోరెత్తిన ట్రాక్టర్లు**

**సీఎం చంద్రబాబు పేరున ప్రత్యేక పూజలు**





**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 25**

వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ పూర్తయి ఈ నెల 31న సీఎం నారా చంద్రబాబు నాయుడు నీటి విడుదల చేయనున్న నేపథ్యంలో కృతజ్ఞతగా పట్టణంలో భారీ ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆదేశాల మేరకు కూటమి నేతల ఆధ్వర్యంలో ఈ ర్యాలీ జరిగింది.మార్కెట్ యార్డ్ నుండి ప్రారంభమైన ర్యాలీ కాలేజీ రోడ్, దోర్నాల బస్టాండ్, అమ్మవారి శాల, గడియార స్తంభం సెంటర్, కంభం బస్టాండ్, కోర్టు సెంటర్, పూల సుబ్బయ్య కాలనీ మీదుగా అల్లూరు పోలేరమ్మ దేవస్థానం వరకు సాగింది. నియోజకవర్గ నలుమూలల నుండి రైతులు, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు వందలాది ట్రాక్టర్లతో తరలివచ్చారు.అనంతరం పోలేరమ్మ దేవస్థానంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ ప్రత్యేక పూజలు చేశారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వెలిగొండ కల సాకారమవుతున్నందుకు ఈ ప్రాంత ప్రజలు ఎప్పటికీ రుణపడి ఉంటారని కూటమి నేతలు అన్నారు. బుధవారం సాయంత్రం 4 గంటలకు పోలేరమ్మ దేవస్థానం నుండి లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు, కూటమి శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ కందుల రామిరెడ్డి, యువ నాయకుడు కందుల విగ్నేష్ రెడ్డి, జనసేన ఇంచార్జ్ ఇమ్మడి కాశీనాథ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ కృష్ణారావు, ఏఎంసీ చైర్మన్ వెంకటరెడ్డి,రాష్ట్ర బిజెపి మహిళా మోర్చా కార్యదర్శి బెల్లంకొండ విజయలక్ష్మి, బెల్లంకొండ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనకు సమన్వయంతో పని చేయాలి - జిల్లా కలెక్టర్ రాజాబాబు



**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 25**

జిల్లాలో అన్ని శాఖలు సమన్వయంతో మాదక ద్రవ్యాల నిర్మూలనకై కలిసి పనిచేసి 100 శాతం నిర్మూలించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు సంబంధిత అధికారులకు సూచించారు.మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని విసీ హాలు నుండి జిల్లా అధికారులతో ఎన్ సి ఓ ఆర్ డి కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే నెల నుండి ప్రభుత్వ పాఠశాలలలో యువశక్తి కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని అందులో మాదగద్రవ్యాలు వినియోగం వల్ల వచ్చే దుష్పరిణామాలు పై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. జిల్లాలో 100 శాతం మాదక ద్రవ్యాలును నిరోధించే విధంగా కలిసికట్టుగా అన్ని శాఖలు పనిచేయాలని గత సమావేశంలో జరిగిన తీర్మానాల దృష్ట్యా తీసుకున్న చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అన్ని శాఖలు సంయుక్తంగా పనిచేస్తున్నారని అభినందించారు. ముఖ్యంగా మైన్స్ అండ్ జియాలజీ, వైద్య ఆరోగ్యశాఖ, అటవీ శాఖ, ప్రభుత్వ కళాశాల, ఈగల్ టీములు బాగా పనిచేస్తున్నాయని తెలిపారు. జిల్లాలో మాదకద్రవ్యాల అవకాశమున్న ప్రాంతాలను గుర్తించి వాటిని నిరోధించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా హాట్ స్పాట్ లను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. జిల్లా జైలులో ఉన్న ఖైదీల పరిస్థితులను, వారికి అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అక్రమ మద్యం నిషేదించడానికి అవసరమైన పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. మాదకద్రవ్యాలు వినియోగం అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి తరచూ అక్కడ పర్యటిస్తూ వాటిని నిషేధించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఎన్ సి ఓ ఆర్ డి నోడల్ అధికారి ఆయేషా బేగం మాట్లాడుతూ జిల్లాలో 37 కేసుల ద్వారా 147.65 కేజీల గంజాయిని నిర్వీర్యం చేసినట్లు తెలిపారు.322 గంజాయి ప్యాకెట్లను, 510 గంజాయి మిక్స్ చాక్లెట్లను పట్టుకోవడం వాటినీ నిర్మూలించడం జరిగిందని ఆమె తెలిపారు. జిల్లాలో డిస్టిక్ డిస్పోజల్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని ఆమె ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట రమణ, తదితరులు పాల్గొన్నారు.

# పాముకాటుకు గురై మృతి చెందిన మహిళా కుటుంబాన్ని రైతు ఆదుకోవాలి

**నావద్ద ఏమిఉందని ఇవ్వాలి, అసలే వ్యవసాయం బరువైంది. పంటలకు గిట్టుబాటు ధరలేదు రైతు ఆవేదన**



**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 25**

గిద్దలూరు నల్లబండ బజారు కూలీ పని కోసం చిక్కుడు కాయలు కోస్తుండగా పాము కాటుకు గురై మృతి చెందినమహిళకు భూయజమాని నష్టపరిహారం కింద ఆదుకోవాలని కూలి యొక్క కుటుంబీకులు అందరూ నిరసన తెలుపుతున్నారు పాముకాటుకు గురైతే మేము ఎలా సహాయం చేస్తాము ఏదైనా మీరు లైఫ్ ఇన్సూరెన్స్ చేసుకుంటే ఇలాంటి దుర్ఘటన జరిగినప్పుడు మంచి జరిగే అవకాశం ఉంటుంది కానీ రైతును డిమాండ్ చేస్తే అర్థం ఉంటుందా కానీ రైతు చేను దగ్గర చనిపోవడంబధకరమే కానీ కుటుంబ సభ్యుల అందరూ వచ్చి నిరసన తెలిపితే మేము ఎలా మిమ్మల్ని అందుకోవాలి మా దగ్గర అంతా స్తోమత లేదు భగవంతుడా అని ఆవేధన చెందుతున్న రైతు, మాకు గిట్టుబాటు ధర లేక దిగబడి లేక పెట్టుబడి ఎక్కువ అయి అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకుంటా ఉంటే ఉపాధి కోసం వచ్చి మీరు పని చేసినందుకు రోజువారి కూలి తీసుకుని మీరు మా రైతాంగం ద్వారా మీరు కూడా కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు కదా మరి మా బాధలు కూడా మీకు తెలుసు అలాంటప్పుడు ఇలాంటి దురదృష్టకరమైన సంఘటనలు జరిగినప్పుడు బాధాకరమైన విషయం తెలిసిందే అలా అని మమ్మల్ని మీరు డిమాండ్ చేసి నిరసన తెలిపితే మా దగ్గర ఇచ్చే స్తోమత లేదమ్మా అని రైతు ఆవేదన తో వాళ్లకి తెలిపారు రైతులు కూలీలను పనుల కోసం తీసుకెళ్తే ఇలాంటి సంఘటనలు ఎదురైనప్పుడు రైతు పంటలు పండించే పరిస్తితి ఉంటుందా అని క్రౌన్ హ్యూమన్ రైట్స్ ప్రతినిధి కీ తెలిపారు.

# మిలాద్ ఉన్ నబీ పర్వదిన వేడుకలకు ముస్తాబైన మసీదులు, మదరసాలు

**బుధవారం రాత్రి జరిగే ప్రత్యేక నమాజులు, బయాన్ కార్యక్రమాలలో పాల్గొననున్న ముస్లిం సోదరులు, సోదరీమణులు.**

**కొమరోలు పెన్ పవర్ ఆగస్టు 25**

మహమ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకుని నెల 26వ తేదీ 26వ బుధవారం జరిగే మిలాద్ ఉన్ నబి వేడుకలకు కొమరోలు మండలంలోని మసీదులు, మదరసాలు ముస్తాబయ్యాయి. ముస్లింలు జరుపుకునే అతి ముఖ్యమైన పండుగలలో మిలాద్ ఉన్ నబి పర్వదినము ఒకటి. రంజాన్, బక్రీద్ పండుగలతో పాటు మీలాదున్నబీ పర్వదినానికి అత్యంత ప్రాముఖ్యత ఉన్నది. ముస్లింలు మహమ్మద్ ప్రవక్త జయంతి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని కొమరోలు మండలంలోని కొమరోలు లోగల మూడు మసీదులను అల్లినగరం రెడ్డి చర్ల పోసుపల్లి ఎడమ కళ్ళు ముక్తాపురం రాజుపాలెం నల్లగుంట్ల హనుమంతరాయుని పల్లె తదితర గ్రామాలలోని మసీదులను, మదరసాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించి నమాజులకు ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రి ముస్లిం సోదరులు మసీదులలో జరిగే ప్రత్యేక ప్రార్థనలు బయాన్ కార్యక్రమాలలో పాల్గొంటారు. మసీదులలో పేష్ ఇమాములు ప్రత్యేక నమాజులు నిర్వహించి మహమ్మద్ ప్రవక్త జీవిత విశేషాలను వివరిస్తూ బయాన్ చేస్తారు. ఇక మహిళలు ఇళ్లలోనే జట్లు జట్లుగా ఏర్పడి ప్రత్యేక నమాజులలో పాల్గొంటారు. మిలాద్ ఉనవి పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లింలు తీపి వంటకాలు తయారు చేసి ఫాతేహాలు సమర్పిస్తారు.



కొమరోలు లోని జామియా మసీదులో జరిగే ప్రత్యేక ప్రార్థనలు బయాన్ లను పేష్ ఇమామ్ షఫీ ఉల్లా, అబూబకర్, తదితర మత పెద్దల ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. అలాగే మక్కా మసీదులో పేష్ ఇమామ్ ఫక్రుద్దీన్ , నూరాని మసీదులో పేష్ ఇమామ్ అబ్దుల్ హమీద్ నిర్వహిస్తారు. అలాగే మండలంలోని అన్ని మసీదులలో ఆయా మసీదులకు చెందిన పేష్ ఇమాములు ప్రత్యేక నమాజులు భయాన్లు నిర్వహిస్తారు, ఇక మదరసాలలో నిర్వాహకులు బాలబాలికలతో నమాజులు చేయించి మహమ్మద్ ప్రవక్త జీవిత విశేషాలను వివరిస్తారు. రాత్రి ఒంటి గంట తర్వాత ప్రత్యేక దువా చేస్తారు.

# అభివృద్ధి పనుల నేపథ్యంలో.. నేడు అద్దంకిలో కరెంటు కోత

**అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) ఆగస్టు 25:**

అద్దంకి పట్టణంలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రాంనగర్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు వెల్లడించారు.?ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రాంనగర్ ప్రధాన రహదారి, రాంనగర్ కూడలి, కొత్త పసుమర్తిపాలెం, గ్యాస్ గూడెం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని, విద్యుత్ సంస్థ సిబ్బందికి సహకరించాలని అధికారులు కోరారు.

# జగన్‌ని బుర్రా



**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 25**

తాడేపల్లి వైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం పార్టీ అధినేత,మాజీ సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి ని మాజీ శాసనసభ్యులు కందుకూరు నియోజకవర్గం వైయస్ఆర్ సీపీ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి సంబందించిన పలు కీలక అంశాలు జగన్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వం హామీల మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం,పార్టీ బలోపేతం, స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధత, అభ్యర్థుల ఎంపిక, గ్రామ స్థాయి నుండి నియోజకవర్గ స్థాయి వరకూ స్థానిక సంస్థల ఎన్నికల ప్రణాళికలు,వైయస్సార్‌సీపీ ప్రభుత్వ సంక్షేమ పాలనపై ప్రచారం,తాజా రాజకీయ పరిణామాలు,ఎస్ఐఆర్ ప్రక్రియ తదితర కీలక అంశాలపై దిశానిర్దేశం చేసినట్లు బుర్రా మధుసూదన్ యాదవ్ వెల్లడించారు.త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి కార్యకర్తకు, పార్టీ నాయకులకు అండగా నిలబడాలని ప్రజల్లో ధైర్యంగా ఉండి వైఎస్ఆర్సిపి సిద్ధాంతాలను బలంగా తీసుకెళ్లాలని జగన్ సూచించగా, కందుకూరులో పార్టీని మరింత బలోపేతం చేస్తానని బుర్రా మధుసూదన్ యాదవ్ తెలిపారు.

# అంబేద్కర్ విగ్రహ ఏర్పాటును అడ్డుకోవడం దారుణం

## నూజిళ్లపల్లి ఘటనపై ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన.

## దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం. నాగేంద్రరావు.

**అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) ఆగస్టు 25**

జె.పంగులూరు మండలం, నూజిళ్లపల్లిలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటును అడ్డుకోవడం అత్యంత దారుణమని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం. నాగేంద్రరావు మండిపడ్డారు. దళితులను అడ్డుకుని, విగ్రహాన్ని నిర్బంధించిన అధికారులపై తక్షణమే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఘటనపై మంగళవారం అద్దంకి ఆర్డీవో విజయ జ్యోతి కుమారితో జరిపిన చర్చలు విఫలం కావడంతో, అధికారుల వైఖరికి నిరసనగా ఆర్డీవో కార్యాలయం ఎదుట దళిత సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు.

**మంత్రికి అనుకూలంగా అధికారుల వైఖరి..**

విదేశాల్లో సైతం రాజ్యాంగ నిర్మాతను ఆరాధిస్తుంటే, ఆయన పుట్టిన దేశంలోనే అవమానిస్తున్నారని నాగేందర్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లండన్ పర్యటనలో అంబేద్కర్ చదువుకున్న గ్రంథాలయాన్ని సందర్శించి నివాళులర్పించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అగ్రకుల రక్షణ వైఖరితో నూజిళ్లపల్లిలో విగ్రహ స్థాపనను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. మంత్రికి భయపడే జిల్లా కలెక్టర్, ఎస్పీలు ఆ గ్రామాన్ని కనీసం సందర్శించడం లేదని విమర్శించారు. దళితులు సర్వే నంబర్ 133లోని ప్రభుత్వ డొంక పోరంబోకు స్థలంలో





ముఖద్వారం, విగ్రహం ఏర్పాటుకు పూనుకుంటే అధికారులు ఏడాది కాలంగా అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 10వ తేదీన దళితులను అదుపులోకి తీసుకున్న దర్శి డీఎస్పీ బాలమురళీకృష్ణ, తహసీల్దార్ సింగారావు.. విగ్రహాన్ని సైతం తహసీల్దార్ కార్యాలయంలో అక్రమంగా నిర్బంధించారని ఆరోపించారు.

**ఆర్డీవో తీవ్ర అసహనం..**

కలెక్టర్ ఆదేశాలతో మంగళవారం ఆర్డీవో విజయ జ్యోతి కుమారితో చర్చలకు వెళ్లగా, ఆమె దళితుల పట్ల తీవ్ర అసహనం ప్రదర్శించారని నాగేంద్రరావు ఆరోపించారు. మాట్లాడేందుకు తమకు సమయం లేదంటూ కేవలం ఐదు నిమిషాల్లోనే అక్కడినుంచి వెళ్లిపోయారని విమర్శించారు. జాతీయ రహదారులపై ఎలాంటి అనుమతులు లేని రాజకీయ నాయకుల విగ్రహాలు పెడుతున్నప్పుడు సుప్రీంకోర్టు తీర్పులు గుర్తుకురాలేదా అని ప్రశ్నించారు. మార్టూరు మండలం దేగరమూడిలో దళితుల ఆందోళనతో అప్పటి బాపట్ల కలెక్టర్ అగ్రవర్ణాల అభ్యంతరాలను తోసిపుచ్చి విగ్రహానికి అనుమతి ఇచ్చారని గుర్తుచేశారు. నూజిళ్లపల్లిలో ఎస్సీ కాలనీ ముఖద్వారంతో పాటు అంబేద్కర్ విగ్రహాన్ని వెంటనే ఏర్పాటు చేసేలా కలెక్టర్, ఎస్పీ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విగ్రహాన్ని నిర్బంధించిన డీఎస్పీ, ఆర్డీవో, తహసీల్దార్లపై అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు దారా అంజయ్య, కాకుమాను రవి, కిరణ్ కుమార్, పత్రా రాజేష్, దేవరపల్లి గోపి కరుణాకర్, మేడికొండ మురళి, బంగారం, నూజిళ్లపల్లి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 28న ఒంగోలులో రాష్ట్ర విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి శ్రీ నారా లోకేష్ పర్యటన స్థానిక ఎమ్మెల్యే బి.ఎన్ విజయ్ కుమార్, ఏం.ఎల్ సి రాజు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ పి. రాజా బాబు





**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 25**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఈ నెల 28వ తేదీన ఒంగోలు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా నాగులుప్పలపాడు మండలం చదలవాడ గ్రామం వద్ద అంతర్జాతీయ స్థాయిలో నిర్మించతలపెట్టిన ప్రతిష్టాత్మక 'రాడిసన్ హోటల్' శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ?ఈ పర్యటన నేపథ్యంలో మంగళవారం నాడు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను, హోటల్ నిర్మాణ స్థలాన్ని జిల్లా కలెక్టర్ పి. రాజా బాబు, సంతనూతలపాడు శాసనసభ్యులు బి. ఎన్. విజయ్ కుమార్, ఎమ్మెల్సీ రాజు, ప్రముఖ నాయకులు కంది రవిశంకర్ సంయుక్తంగా పరిశీలించారు. ?ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి. రాజా బాబు మాట్లాడుతూ? హోటల్ 'రాడిసన్' ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయడం ప్రకాశం జిల్లా సమగ్ర అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతుందన్నారు. దీనివల్ల ఒంగోలు, దాని చుట్టుపక్కల ప్రాంతాల యువతకు పెద్ద ఎత్తున ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయనీ ఆయన చెప్పారు. అలాగే ఆర్థిక కార్యకలాపాలు మరింత పుంజుకుంటాయన్నారు. ?మంత్రి పర్యటన నిమిత్తం చేపడుతున్న ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా, ప్రోటోకాల్ నిబంధనలకు అనుగుణంగా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఒంగోలు ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు, నాగులుప్పలపాడు తహసీల్దార్ ప్రవీణ్, ఇతర స్థానిక అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## బీజేపీ నాయకులు హరిశ్చరణ్ దేవగన్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు

**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 25**



భారతీయ జనతా పార్టీ నాయకులు, నీచ్ అగ్రికల్చరల్ ఆర్గనైజింగ్ ఫార్మల్ లిమిటెడ్ చైర్మన్ హరిశ్చరణ్ దేవగన్ పుట్టినరోజు సందర్భంగా గిద్దలూరు భారతీయ జనతా పార్టీ నాయకులు అప్పిశెట్టి ఉదయ శంకర్ హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయ శంకర్ మాట్లాడుతూ.. హరిశ్చరణ్ దేవగన్ బీజేపీ బలోపేతానికి, ప్రజాసేవకు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సీనియర్ నాయకుడిగా ఆయన అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. హరిశ్చరణ్ దేవగన్ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, ప్రజలకు , పార్టీకి మరింత సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి, సమృద్ధి కలగాలని, కుటుంబ సభ్యులతో ఆనందంగా నిండు నూరేళ్లు జీవించాలని అప్పిశెట్టి ఉదయ శంకర్ కోరారు. ఈ సందర్భంగా హరిశ్చరణ్ దేవగన్‌కు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

## వైఎస్ జగన్‌ను కలిసిన డాక్టర్. అశోక్ కుమార్

### తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వక భేటీ

**అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) ఆగస్టు 25:**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్. చింతలపూడి అశోక్ కుమార్ పాల్గొన్నారు. సమావేశం అనంతరం అధినేత జగన్ ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అద్దంకి నియోజకవర్గంలోని తాజా రాజకీయ పరిణామాల గురించి చర్చించినట్లు తెలిపారు. ?ఈ సమావేశంలో బాపట్ల జిల్లా పార్టీ అధ్యక్షుడు మేరుగు. నాగార్జున, రేపల్లె నియోజకవర్గ ఇంచార్జ్ పీటా. నాగ మోహన్ కృష్ణ, ఒంగోలు నియోజకవర్గ బాధ్యులు చుండూరి. రవిబాబు తదితరులు పాల్గొన్నారు.



# 28 న మంత్రి లోకేష్ ఒంగోలు రాక

**– మంత్రి లోకేష్ పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జోనల్ కోఆర్డినేటర్ గోపాలపురం నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు**



**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు ఆగస్టు 25**

ఈనెల 28వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటి ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్,ఆర్టీజి మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ప్రకాశం జిల్లాకు విచ్చేయుచున్న సందర్భంగా వారి పర్యటన ఏర్పాట్లను పరిశీలించేందుకు జోనల్ కో-ఆర్డినేటర్ గోపాలపురం నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు నగరంలో పర్యటించారు. ఆయన వెంట ఒంగోలు పార్లమెంట్ కార్యాలయానికి విచ్చేసి పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు కనిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహా రెడ్డి, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ ఉన్నారు. అనంతరం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు, సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే బి.ఎన్. విజయ్ కుమార్ ని కలసి లోకేష్ పర్యటన సందర్భంగా నియోజకవర్గాలలో చేస్తున్న ఏర్పాట్లను అడిగి తెలుసుకొని తగు సూచనలు చేశారు. కూటమి ప్రభుత్వం లో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీ కార్యకలాపాలకు సంబంధించిన ప్రదేశాలను జోనల్ కోఆర్డినేటర్, జిల్లా పార్టీ అధ్యక్షులు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత ప్రాంతాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లు, పార్టీ కార్యక్రమాల నిర్వహణ, కార్యకర్తల సమన్వయం తదితర అంశాలపై నాయకులతో వారు చర్చించారు. రాష్ట్ర పార్టీ ఇచ్చిన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం ఒంగోలు పార్లమెంట్ టీడీపీ కార్యాలయ నూతన భవన నిర్మాణ ప్రదేశాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న నిర్మాణ పనులను ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు డా.ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, జాతీయ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు.. ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ లతో కలసి మద్దిపాటి వెంకట రాజు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కొఠారి నాగేశ్వరరావు, తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# చిన్నారుల్లో అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించాలి

**ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమ లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేయాలి -సిడిపిఓ షేక్ ఆశాబేగం**

**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 25**

చిన్నారులకు బాల్యదశ నుంచే బలమైన అభ్యసనా పునాది ఏర్పడేలా ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని అంగన్వాడీ కేంద్రాల్లో సమర్థవంతంగా అమలు చేయాలని వెలిగండ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో షేక్ ఆశాబేగం అన్నారు. జ్ఞానజ్యోతి 120 రోజుల సర్టిఫికెట్ కోర్సులో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలకు నిర్వహించిన మూడు రోజుల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు.ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమం ద్వారా చిన్నారుల్లో చదవడం, రాయడం, వినడం, మాట్లాడడం వంటి భాషా నైపుణ్యాలతో పాటు ప్రాథమిక సంఖ్యా పరిజ్ఞానాన్ని పెంపొందించడమే ప్రధాన లక్ష్యమన్నారు. పిల్లల వయసు, వారి అభ్యసనా స్థాయికి అనుగుణంగా బోధనా పద్ధతులను అనుసరించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు బోధనను కేవలం పుస్తకాలకే పరిమితం చేయకుండా ఆటలు, పాటలు, కథలు, చిత్రాలు, స్థానికంగా లభించే వస్తువుల ద్వారా ఆసక్తికరంగా నిర్వహించాలని తెలిపారు. స్థానిక వనరులను వినియోగించి తక్కువ కేంద్రాలలో ఖర్చుతో బోధనా సామగ్రిని తయారు చేసుకోవాలని సూచించారు. పిల్లలను ప్రశ్నలు అడిగేలా, తమ ఆలోచనలను స్వేచ్ఛగా



వ్యక్తం చేసేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. మూడు రోజుల శిక్షణలో నేర్చుకున్న అంశాలను అంగన్వాడీ కేంద్రాల్లో ప్రతి చిన్నారి అభ్యసన స్థాయి గుర్తించి అందుకు అనుగుణంగా బోధన అందించాలన్నారు ఎఫ్ ఎల్ ఎన్ కార్యక్రమం ద్వారా చిన్నారుల్లో ఏర్పడే ప్రాథమిక నైపుణ్యాలు భవిష్యత్తు విద్యాభ్యాసానికి బలమైన పునాదిగా నిలుస్తాయన్నారు శిక్షణలో కీ రిసోర్స్ పర్సన్స్ ఉపాధ్యాయులు కొండయ్య, చెన్నయ్య అంగన్వాడీ కార్యకర్తలకు పాలు అంశాలపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ కృపావరం, కీ రిసోర్స్ పర్సన్స్ కొండయ్య, చెన్నయ్య, అంగన్వాడీ ఆక్టివ్ సూపర్వైజర్ సరళ అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఈ నెల 31న ముఖ్యమంత్రి చేతుల మీదుగా వెలిగొండ ప్రాజెక్టు నుంచి నీటి విడుదల

## భారీ బహిరంగ సభా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత

**5 కి.మీ. పొలాల్లో పర్యటించి పార్కింగ్ స్థలాలను పరిశీలించిన ఉన్నతాధికారులు**

**ఫీడర్ కెనాల్, క్రషర్ గేట్ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశం**



**పెద్ద దోర్నాల పెన్ పవర్ ఆగస్టు 25**

ఈ నెల 31వ తేదీన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెలిగొండ ప్రాజెక్ట్ నుంచి నీటిని విడుదల చేయనున్న శుభసందర్భంగా, దోర్నాల మండలం గంటవానిపల్లి వద్ద ముఖ్యమంత్రి గారి పర్యటన మరియు బహిరంగ సభా ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత గురువారం పరిశీలించారు. ముఖ్యమంత్రి బహిరంగ సభా స్థలాన్ని, వాహనాల పార్కింగ్ ప్రాంతాలను కలెక్టర్ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పార్కింగ్ ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. పార్కింగ్ స్థలాలకు సంబంధించిన సరైన ఏర్పాట్లను ప్రత్యక్షంగా సమీక్షించేందుకు జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు స్వయంగా పొలాల గుండా సుమారు 5 కిలోమీటర్ల మేర పర్యటించారు. ప్రస్తుతం చివరి దశలో ఉన్న ఫీడర్ కెనాల్ పనులను, క్రషర్ గేట్ల బిగింపు ప్రక్రియను అత్యంత వేగంగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని ప్రాజెక్ట్ ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యమంత్రి బహిరంగ సభకు సంబంధించిన వేదిక, విఐపి/సాధారణ ప్రజల గ్యాలరీలు, తాగునీరు, పారిశుధ్యం తదితర పనులను తక్షణమే ప్రారంభించి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, యర్రగొండపాలెం తెదేపా ఇంచార్జి ఎరిక్షన్ బాబు, వెలుగొండ ప్రాజెక్ట్ సూపరింటెండింగ్ ఇంజనీర్ అబుతాలిం తదితరులు పాల్గొన్నారు.

# తాగి వాహనం నడిపినందుకు 13మందికి జరిమానా

## – ట్రాఫిక్ సీఐ హజరతయ్య

**మునిసిపల్ కార్పొరేషన్ ఒంగోలు,పెన్ పవర్ ఆగస్టు 25**




మద్యం తాగి వాహనం నడుపుతున్న 13 మందిని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరు పరచగా వారికి ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున కోర్టు వారు జరిమానా విధించినట్టు ట్రాఫిక్ సీఐ సి. హెచ్. హాజరతయ్య ఒక ప్రకటనలో తెలియజేశారు. మోటార్ వెహికల్ నిబంధనలను అతిక్రమించి మద్యం తాగి వాహనాలు నడపడం చట్టరీత్య నేరమని ఆయన తెలిపారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, ట్రిపుల్ రైడింగ్ ప్రాణాపాయమని కావున వాహన చోదకులు తప్పనిసరిగా మోటారు వెహికల్ నిబంధనలు పాటించి సురక్షితంగా ప్రయాణం చేయవలసిందిగా ఆయన కోరారు.

# గిద్దలూరులో ఎక్సైజ్ అధికారుల ఆకస్మిక తనిఖీలు

**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 25**

గిద్దలూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను ప్రకాశం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల క్రైమ్, ఎన్‌డిపిఎల్, ఎన్‌డిపిఎస్, బైండ్‌ఓవర్ అలాగే చార్జ్‌షీట్ కేసుల పురోగతిని సమీక్షించారు.– పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని స్టేషన్ సిబ్బందికి తగిన దిశానిర్దేశం చేశారు. ఇదే సమయంలో పాత ఎన్‌డిపిఎల్ కేసుల్లోని నిందితులకు ప్రత్యేకంగా కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం గిద్దలూరు పట్టణంలోని పలు మద్యం దుకాణాలను ఒంగోలు ఎఈఎస్ ఏ.జనార్దన్ రావు తో కలిసి ఆమె తనిఖీలు చేశారు. దుకాణాలకు సంబంధిత రిజిస్టర్లను పరిశీలించడంతో పాటు, 'ఎక్సైజ్ సురక్ష యాప్' ద్వారా కొన్ని మద్యం బాటిళ్లను యాదృచ్ఛికంగా స్కాన్ చేసి వాటి అసలు వివరాలను ఆమె పరిశీలించారు. ఈ తనిఖీల సందర్భంగా తక్కువ ఆఫ్‌టేక్ నమోదవుతున్న షాపుల లైసెన్సుదారులు ప్రస్తుత నెల నిర్దేశిత ఆఫ్‌టేక్ లక్ష్యాన్ని సాధించేలా తగినంత మద్యం స్టాక్‌ను సకాలంలో లిఫ్ట్ చేసుకోవాలని స్పష్టం చేశారు. – నిబంధనలను ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం దుకాణదారులు తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఎం.జయరావు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com